



బాపట్లలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయాధికారులు



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న బాపట్ల కలెక్టర్ వెంకటమురళి

కుప్పడం చీరకు అవార్డు

◆ కేంద్రమంత్రి చేతుల మీదుగా అందుకున్న బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల సిల్క్ కుప్పడం చీరకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఢిల్లీ భారత్ మండపంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిం చిన అవార్డుల ప్రధానోత్సవంలో బాపట్ల కలెక్టర్ వెంకటమురళి కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఒక జిల్లా - ఒక ఉత్పత్తి(ఓడీఓపీ) కార్యక్రమంలో భాగంగా చీరాలకు అరుదైన ఘనత దక్కడంతో ఈ ప్రాంత నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చీరాల చేనేతలు దేశ చరిత్రలోనే ప్రత్యేక స్థానం దక్కించుకుని జిల్లాకు కీర్తిని సాధించారని చెప్పారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర జౌళిశాఖ మంత్రి సవిత ఉన్నారు.

32 సొసైటీలకు..
త్రిసభ్య కమిటీలు

ఇటీవలే 50 సహకార సంఘాలకు నియామకం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాలుగా త్రిసభ్య కమిటీల నియామకం దాదాపుగా కొలిక్కి వచ్చింది. ఈ నెల 8న జిల్లాలో 50 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం సోమవారం మరో 32 సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకంపై ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో మొత్తం 112 సహకార సంఘాలు ఉండగా ఇప్పట వరకు 82 సొసైటీలకు నియామకం పూర్తయింది. ఒక్కో సహకార సంఘానికి చైర్‌పర్సన్‌తో పాటు ఇద్దరు సభ్యులను ప్రభుత్వం నియమించింది. సహకార సంఘాలను వైసీపీ ప్రభుత్వం దాదాపుగా నీర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం ప్రక్షాళనపై దృష్టి పెట్టింది. దానిలో భాగంగానే ఇప్పటికే రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసింది. ఖాతాల్లో అవకతవకలపై దృషిపెట్టి నోటీసులు జారీ చేసి.. వివరణ కోరుతున్నారు. ప్రస్తుతం త్రిసభ్య కమిటీలు కూడా కొలువుదీరనుండడంతో సహకార సంఘాల పాలన పూర్తి స్థాయిలో గాడిన పడనుంది.

పల్లెకు ఉపాధి పండగ

❖ ఉపాధి హామీ పథకం కింద రూ.28 కోట్లు నిధులు విడుదల

❖ 'గోకులం షెడ్లు' రైతుల ఖాతాల్లో నగదు జమ

❖ గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులకూ మోక్షం



కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
పల్లెకు 'ఉపాధి' పండగొచ్చింది. నిధుల వరదతో గ్రామీణ ప్రగతి ఊపందుకోనుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో.. కాంట్రాక్టర్ల కష్టాలు తీరనున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి పనులు చేసి.. వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పెట్టడంతో బిల్లుల రాక ఆర్థిక కష్టాల్లో చిక్కుకున్న వారికి కూడా ఊరట లభించింది. గతేడాది ఆగస్టు 23న గ్రామ సభలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికి కొనసాగింపుగా అక్టోబరు 14 నుంచి 21వ తేదీ వరకు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధి హామీ పథకం అనుసంధాన నిధులతో పల్లెల్లో రహదారులు, మురుగు కాల్వల పనులు అక్టోబరు చివరి నుంచే ప్రారంభమయ్యాయి. సమాంతరంగా గ్రామాల్లో రైతులు రాయితీపై గోకులం షెడ్లు నిర్మించుకున్నారు. తొలి విడత పనులకు డిసెంబరులో బిల్లులు చెల్లించిన ప్రభుత్వం.. ఆ తర్వాత కొంతమేర జాప్యం జరుగుతూ రావడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు దాదాపు ఆరు నెలల నుంచి డబ్బులు కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు రూ.28 కోట్ల నిధులు విడుదల కావడంతో పాటు ఇప్పటికే రూ.20 కోట్లు వరకు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో రెండు నెలలుగా నత్తనడకన సాగుతున్న పల్లె పనులు ఇకపై ఊపందుకోనుండడంతో పల్లెకు నిధుల పండగ వచ్చిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

మొత్తం పనులు 646

ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో జిల్లాలో చేపట్టిన మొత్తం పనులు 646 కాగా.. వీటి విలువ రూ.92 కోట్లుగా అధికారులు లెక్కగట్టారు. వీటికి సంబంధించి 25 శాతం పనులు ఇప్పటికే పూర్తియ్యాయి. మిగిలినవి జరుగుతున్నాయి. సీసీ, బీటీ రోడ్లతో పాటు మురుగు కాల్వల నిర్మాణాలు కూడా ఈ పనుల్లో ఉన్నాయి. ఈ పనులతో పాటు రైతులకు రాయితీపై గోకులం షెడ్ల నిర్మాణం కూడా పెద్ద ఎత్తున ప్రభుత్వం చేపట్టింది. జిల్లాలో 580 వరకు షెడ్ల నిర్మాణాలను రైతులు చేపట్టారు. వీటి నిర్మాణం పూర్తయి నాలుగు నెలలు కావొస్తుండగా, నిధులను కూడా ప్రభుత్వం విడుదల చేసింది.

ప్రభుత్వం విడుదల చేసిన రూ.28కోట్లలో రూ.19 కోట్లు రహదారులు, ప్రహరీలు, మురుగు కాల్వల నిర్మాణానికి సంబంధించి నవి. రూ.6 కోట్లు గోకులం షెడ్ల లబ్ధిదారుల ఖా తాల్లో జమ కానున్నాయి. ఇదిలా ఉంటే 2014-19 మధ్య చేపట్టిన పనులు కాంట్రాక్టర్లకి కూడా ప్రస్తుతం ఊరట లభించింది. ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో గత పాలకులు బకాయి ఉంచిన రూ.3 కోట్లు నిధుల విడుద లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

రూ.28 కోట్లు నిధులు విడుదల

రూ.80 లక్షలకు సాంకేతిక చిక్కులు

మొత్తం విడుదలైన రూ.28 కోట్లలో దాదాపు రూ.20 కోట్లు ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయని, త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇక రూ.80 లక్షల (మిగతా 6లో)

ఎరువు దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

◆ రూ. 27.41 లక్షల బయో ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేత

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని మహాత్మా గాంధీ రోడ్డులో ఉన్న పద్మావతి ఫర్టిలైజర్ అండ్ జనరల్‌గూడ్స్‌లో జీ2, జీ3 సర్టిఫికెట్లు లేని బయో ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే విక్రయాలు నిలిపివేయాలని తనిఖీ అధికారి ఎం.శ్రీనివాసరావు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్ ఆదేశించారు. అనుమతులు లేకుండా విక్రయించిన, అధిక ధరకు విక్రయాలు జరిపిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూనికలు, కొలతల విషయంలో తేడా ఉన్నట్లు గుర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కె.ధనరాజు, వ్యవసాయాధికారులు కె.శారద, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కర్లపాలెం, అమర్తలూరు మండలాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు.

'మనమిత్ర'తో.. అన్నదాత సుఖీభవ

- అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేదా..?
- మన మిత్ర వాట్సాప్ నంబరుకు హాయ్ పెడితే చాలు..
- ఎందుకు అనర్హులయ్యారో వెంటనే సమాచారం

8

ఆరుగురు పిల్లలకు రూ.78 వేలు

- 'తల్లికి వందనం'తో.. వైసీపీ సానుభూతిపరుడి మహానందం
- కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

6

కనుమరుగైపోతున్న కళాక్షేత్రం..!

కార్యాలయాలుగా మార్చిన వైసీపీ ప్రభుత్వం
అద్దెలూ చెల్లించని వైనం..
ఆదాయం కోల్పోతున్న పురపాలక సంఘం



బాపట్ల పట్టణంలోని నారాచంద్రబాబు నాయుడు మున్సిపల్ కళాక్షేత్రం

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న జనాభా.. తగ్గుతున్న ఆదాయ వనరులతో పురపాలక సంఘం అభివృద్ధి నత్తనడకలా మారింది. ఓవైపు పురపాలక సంఘ ఎన్నికలు జరగక.. ఆర్థిక సంఘ నిధులు రాక అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. ఆదాయం వచ్చే వనరులు కాస్త వైసీపీ పాలనలో దెబ్బతిన్నాయి. దీనికి పట్టణ నడిబొడ్డున ఉన్న నారా చంద్రబాబు నాయుడు మున్సిపల్ కళాక్షేత్రం దర్పణం పడుతుంది. 2002లో బాపట్ల మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో కొంత భాగాన్ని తీసుకొని అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేరు మీద కళాక్షేత్రం నిర్మించారు. అప్పటి ఎంపీ దగ్గుబాటి రామానాయుడు, ఎమ్మెల్యే మంతెన అనంత వర్మ సహకారంతో మున్సిపల్ చైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తి చేశారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు వివాహం, ఇతర శుభ కార్యాలయాలు జరుపుకునేందుకు తక్కువ అద్దెకు దీనిని కేటాయించే వారు. బాపట్ల పాత బస్టాండ్ కూడలిలో ఉన్న ఈ కళాక్షేత్రానికి మంచి ఆదరణ లభించింది. ఎన్నో వేడుకలు ఇక్కడ జరిగాయి. కళాక్షేత్రాన్ని వేలం ద్వారా కాంట్రాక్టర్‌లకు ఇచ్చేవారు. దీని ద్వారా పురపాలక సంఘానికి ఆదాయం వచ్చేది. అనంతరం నిర్వహణను పురపాలక సంఘం తీసుకోవడం.. మళ్లీ లీజుకు ఇవ్వడం ఇలా జరుగుతూ వస్తోంది.

కళాక్షేత్రం..కార్యాలయమైంది..

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజాప్రయోజనాల దృష్ట్యా తక్కువ అద్దెకు ఇచ్చేందుకు నిర్మించిన నానా చంద్రబాబునాయుడు కళాక్షేత్రం వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్యాలయాలు ఏర్పాటు చేశారు. మండలపరిషత్ కార్యాలయం నూతన భవనం నిర్మిస్తామని తొలిగించి అక్కడ విధులు నిర్వహించే వారందరికి కళాక్షేత్రంలోని పై అంతస్తు ఇచ్చారు. అదేవిధంగా జిల్లా కేంద్రమైందంటూ పంచాయతీరాజ్‌శాఖాధికారులకు గ్రౌండ్ ఫ్లోర్ ఇచ్చారు. దీంతో కళాక్షేత్రం కాస్త కార్యాలయంగా మారిపోయింది. అయితే మండల పరిషత్ కార్యాలయం నూతన భవనం నిర్మించేందుకు ఎవరు ముందుకు రాలేదు. కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యాలయాలు ఖాళీగా చేయటం లేదు. పురపాలక సంఘానికి అద్దె కూడా చెల్లించటం లేదు. దీని వల్ల అటు పురపాలక సంఘం ఆదాయం కోల్పోవడమే కాకుండా ఇటు సామాన్య, మధ్యతరగతి కుటుంబాలవారు తక్కువ ఖర్చుతో శుభ కార్యాలయాలు చేసుకునేందుకు కల్యాణ మండపాలు అందుబాటులో లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. కళాక్షేత్రంలో వేడుక చేసుకుంటే మొత్తం రూ.30 వేలు అద్దె ఇతర ఖర్చులతో ముగించేవారమని.. ఇప్పుడు బయట పుట్టగొడుగులా విస్తరించిన కల్యాణ మండపంలో ఒక్కరోజు అద్దె రూ.30వేల నుంచి లక్ష రూపాయల వరకు ఉంటుందని దీనికి అదనంగా కరెంట్ బిల్లు, వంటసామాను ఇతర ఖర్చులు ఉంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి కళాక్షేత్రానికి పూర్వ వైభవం తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కళాక్షేత్రం ప్రాంగణంలో పిచ్చిమొక్కలు

- జూన్‌లోనే
- ఇస్తామని ప్రకటన.. నిధుల విడుదల
- పలుమార్లు వాయిదా పడిన పంపిణీ - ఆవేదనలో లబ్ధిదారులు

ఇచ్చే తీరిక లేక..!

వెనక్కి వెళ్లిపోయిన స్పౌజ్ పింఛన్ల నగదు

చేతికందిన ఫలం నోటి దాకా రావడం లేదన్న చందంగా మారింది భాగస్వామ్య పింఛనుదారుల(స్పౌజ్) పరిస్థితి. స్పౌజ్ పింఛన్లకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో భాగస్వామి దూరమైనా.. ప్రభుత్వం నుంచి ఒక భరోసా ఉందని పండుటాకులకు దీమా లభించింది. అయితే ఆచరణలో లబ్ధిదారులకు ఇంకా ఊరట దక్కలేదు. పింఛను మంజూరై రెండు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు వారికి నగదు జమ కాలేదు. వచ్చిన నిధులు వెనక్కి వెళ్లిపోతూనే ఉన్నాయి.

అమృతలూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్పౌజ్ కోటాలో ఎంపికైనవారికి తొలుత జూన్ 1న పింఛను అందజేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పాటైన జూన్ 12వ తేదీకి పంపిణీని వాయిదా వేసింది. అందు కోసం రూ.3.32 కోట్లు అధికారుల ఖాతాల్లోకి జమయ్యాయి. అయితే అదే రోజున ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో పింఛన్ల పంపిణీ మరో మారు నిరవధికంగా వాయిదా పడింది. ఎప్పు డు పంపిణీ చేస్తారనే విషయం చెప్పకుండానే వాయిదా వేయడంతో సందిగ్ధం నెల కొంది. అలా జూన్ నెల మొత్తం గడి చిపోవడంతో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నిధులను తిరిగి జమ చే యాలని ఆదేశించారు. దీంతో నిధుల న్ని తిరుగు టపాలో వెనక్కి వెళ్లిపో యాయి. దీంతో జూలైలోనైనా పింఛన్లు అందుతాయనుకున్న లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. ఈ నెలలో ఇప్పటికి 14 రోజులు గడిచిపోయినా.. పింఛన్ల పంపిణీ మాత్రం జరగలేదు. దీంతో మళ్లీ కమిషనరేట్ నుంచి జిల్లా అధికారులకు నగదు తిరిగి వెనక్కి పంపాలని ఆదేశాలు వచ్చాయి. ఫలితంగా ఈ నెల పింఛను నగదు కూడా తిరిగి వెనక్కి వెళ్లిపోతోంది. అయితే ఇలా వెనక్కి వెళ్లిన పింఛను మొత్తాన్ని తిరిగి ఒకేసారి అందజేస్తారా? లేక పథకం అమలులోకి రాలేదు కాబట్టి ఈ రెండు నెలలది మినహా యించి ఒక నెల పింఛనుతోనే సరిపెడతారా? అన్న ఆందోళన లబ్ధిదారులను వెంటాడుతోంది.




● మూడు జిల్లాల్లో 8,304 మందికి..

కూటమి ప్రభుత్వం 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31వ తేదీ మధ్య కాలంలో మృతి చెందిన పింఛన్‌దారుల జీవిత భాగస్వాములకు వారి పింఛను పొందే అవకాశాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో కల్పించింది. మే నెలాఖరుకల్లా అర్హులను ఎంపిక చేసి వారికి జూన్ నెల నుంచి పింఛను అందజేస్తామని ప్రకటించింది. దీంతో భాగస్వామి కోటాలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 8,304 మందికి పింఛను పొందే అవకాశం లభించింది. గుంటూరు జిల్లా నుంచి 2,565, బాపట్ల నుంచి 2,715, పల్నాడు నుంచి అత్యధికంగా 3,094 మంది స్పౌజ్ కోటాలో కొత్తగా పింఛను పొందారు.

కారణాలేంటి..?

పింఛను పంపిణీ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం, భాగస్వామ్య పార్టీలు అట్టహాసంగా నిర్వహించాలని భావించాయి. అయితే వివిధ కారణాలతో కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులకు అందుకు అవకాశం లభించలేదని తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు అందరూ సుపరిపాలన కార్యక్ర మంలో తీరిక లేకుండా ఉండడంతో ఈ కార్యక్రమం మరుగున పడిపోయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఈ జాప్యం కారణంగా లబ్ధిదారులకు మాత్రం తీవ్ర నష్టం వాటిల్లింది.



అనమనమూరు సమీపంలో గుండ్లకమ్మ రిజర్వాయర్ అంతర్భాగంలో ఉన్న చేపల చెరువులు (ఫైల్ ఫొటో)

రిజర్వాయర్ ముంపు ప్రాంతంలో యథేచ్ఛగా చేపల చెరువులు
చేపల పెంపకానికి కోళ్ల వ్యర్థాల వినియోగం..
కలుషిత నీరు మళ్లీ రిజర్వాయర్‌లోకి
ఒంగోలు నగరం, ఐదు మండలాలకు ఇదే తాగునీరు

విషతుల్యం.. గుండ్లకమ్మ

అద్దంకి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ కలుషితమవుతోంది. ప్రాజెక్ట్ ముంపు కింద భూములకు పరిహారం పొందిన కొందరు.. వాటిని చేపల చెరువులుగా మార్చారు. చేపల పెంపకానికి కోళ్ల వ్యర్థాలను వేస్తున్నారు. అంతటితో ఆగకుండా ఆ నీటిని రిజర్వాయర్‌లోకి వదులుతు న్నారు. దీంతో రిజర్వాయర్ నీరు పూర్తిగా కలుషితమయ్యే ప్రమాదం ఏర్పడింది. రిజర్వాయర్ నీటిని ఒంగోలు నగరంతో పాటు కొరిశపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, పంగులూరు, అద్దంకి మండలాల్లోని పలు గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. దీంతో కలుషిత నీటినే ప్రజలు వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. అద్దంకి మండలంలోని మోదేపల్లి, తిమ్మారెడ్డిపాలెం, ధేనువకొండ, మణికేశ్వరం, కొరిశపాడు మండలం అనమనమూరుల వద్ద గుండ్లకమ్మ రిజర్వా యర్ పరిధిలో ఉన్న భూములలో సుమారు ఐదారు వందల ఎకరాల్లో చేపల చెరువుల తవ్వకాలు జరిగాయి. ప్రస్తుతం మరి కొంతమంది కొత్తగా చేపల చెరువులు తవ్వకాలు చేస్తునే ఉన్నారు. చెరువుల తవ్వకాలు జరుగుతున్నా రిజర్వాయర్ అధికారులు మిన్నకుండటంతో ఏటికేడు పెరిగిపోతున్నాయి. చేపల చెరువులను కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చిన జాలర్లు లీజుకు తీసుకొని చేపల పెంపకం చేస్తున్నారు. నీటి కలుషిత కారణంగా.. గత నెలలో ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో నీరు రంగు మారి సరఫరా అయ్యాయి. ఇది గమనించిన అధికారులు పరిశీలన చేయగా చేపల చెరువుల నుంచి కలుషిత నీరు రిజర్వాయర్‌లోకి వదులుతుండటం గుర్తించారు. దీనిపై నివేదిక తయారు చేసి బాపట్ల జిల్లా అధికారులకు పంపారు. ఈ నివేదిక పై ఇంత వరకు చర్యలు లేకపోవ డంతో చేపల చెరువుల నిర్వాహకులు మరింత రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పం దించి కఠిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. మిన్నకుంటే కలుషిత నీటిని వినియోగించి ప్రజలు రోగాలు బారిన పడే ప్రమాదం కూడా ఉందని ఆందోళన చెందుతున్నారు.



తిమ్మారెడ్డిపాలెం సమీపంలో గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాంతంలో ఉన్న చేపల చెరువులు

ఆరుగురు పిల్లలకు రూ.78 వేలు

● 'తల్లికి వందనం'తో.. వైసీపీ సానుభూతిపరుడి మహానందం
● కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు


తమ పిల్లలతో కలిసి ఆనందం వ్యక్తం చేస్తున్న సాములునాయక్, నాగేశ్వరబాయి దంపతులు

మాచర్లటౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం పాపిరెడ్డికుంట తండాకు చెందిన కాండ్లావత్ సాములు నాయక్, నాగేశ్వరబాబు దంపతులకు ఆరుగురు ఆడ పిల్లలు సంతానం. కూటమి ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ. 13 వేల చొప్పున మొత్తం రూ. 78 వేలు తల్లి బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. సాములునాయక్ వైసీపీ సానుభూతిపరుడు. గతంలో గ్రామంలో జలంటీర్‌గా పనిచేశారు. 2024 ఎన్నికల్లో కనీసం టీడీపీకి ఓటు కూడా వేయలేదని, అయినా సరే స్కూళ్లు తెరిచే సమయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎటువంటి పక్షపాతం లేకుండా పార్టీలకు అతీతంగా ఆరుగురు బిడ్డలకు తల్లికి వందనం పథకం ద్వారా నగదు బ్యాంకు ఖాతాలో జమ చేశారని, కుటుంబమంతా ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

బాపట్లరూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాపట్ల మండలం ఆసోదివారిపాలెం గ్రామానికి చెందిన దొంతిన ఏడుకొండలురెడ్డి (43) అనే వ్యక్తి బాపట్ల మండలం మద్దిబోయిన వారిపాలెం అడ్డరోడ్డు వద్ద హైవేపై నడుచుకుంటూ వెళుతుండగా చీరాల నుంచి కర్లపాలెం వైపు వెళుతున్న బైక్ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుకొండలురెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు పోలీసులు తరలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

క్వారీ ఆలయ చైర్మన్‌గా శ్రీకాంత్

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జూలై14(ఆంధ్రజ్యోతి): క్వారీ బాల కోటేశ్వర స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా గోళ్లమూడి శ్రీకాంత్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండలి సభ్యులుగా అద్దంకి శ్రీనివాసరావు, కొసరాజు బసంత్ బాబు, దగ్గు వెంకటరమణ, బత్తుల రంగారావు, మోదుగల సుబ్బారెడ్డి, మట్టుపల్లి వెంకటేశ్వరరావు, గుంటూరు వీరాస్వామి, మద్దినేని శ్రీనివాసరావు, లగడపాటి కిరణ్ కుమార్, వెలగా గోపీనాథ్, తాటి.శంకర్, జంపని రామారావు, మక్కే రామారావు, ఏమినేని శ్రీనివాసరావును నియమించారు.

పరామర్శల పేరుతో బెదిరింపు రాజకీయాలు

● ప్రజలపై దండయాత్ర చేస్తున్న జగన్ ● ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, నరేంద్ర

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు పరామర్శల పేరుతో అరాచకాలు సృష్టిస్తూ, మరికొంత మందిని చంపుతూ ఇదేమిటని ప్రశ్నిస్తే రప్పా రప్పా నరుకుతా మంటూ మాట్లాడటం క్షమించరాని విషయమని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరామర్శల పేరుతో జగన్ రెడ్డి కొంతమంది అల్లరి మూకను పోగుచేసి పరామర్శల అర్థాన్నే మార్చేశారన్నారు. కేవలం తమ పార్టీ ఉనికిని కాపాడుకోవటానికి ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నారని విమర్శించారు. జగన్‌కు, వైసీపీకి పెద్ద పాలేరునని చెప్పుకునే పేర్ని నాని చీకట్లో ఎందుకు, పట్టపగలే రప్పా రప్పా అనే కార్యక్రమం చేపడతామని ప్రజల్లో భయాందోళనలు కలిగేలాగా దుర్మార్గంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకుంటుంటే.. వైసీపీకి ఏం చేయాలో అర్థంకాక మామిడి పండ్లు రైతుల పరామర్శ యాత్ర పేరుతో రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోయిన దగ్గర నుంచి పరామర్శల పేరుతో ప్రజలపై దండ యాత్రలు చేస్తున్నారన్నారు. రైతులను పరామర్శల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు తమ రౌడీ మూకలతో అలజడులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అకాల వర్షాలు, వరదలు వస్తే రైతుల ముఖం చూడని జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోగానే రైతులపై కపట ప్రేమ కురిపిస్తున్నాడన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీస్ కమిషనర్ దగ్గరకు వెళ్లి సోషల్ మీడియాలో వైసీపీ వారిపై కేసులు పెట్టాలని చెప్పడం చూస్తే సిగ్గు పడాల్సి వస్తోందన్నారు. వైసీపీ క్యాంప్ క్లర్క్ సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన స్క్రిప్ట్ మాత్రమే రోజుకొకరు మీడియాలో మాట్లాడటం పరిపాటిగా మారిపోయిందన్నారు. సింగయ్య మృతి కేసులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరు చార్జి షీట్లో నెంబర్ వన్ పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దాసరి రాజామాష్టారు, కంచర్ల శివరామయ్య, బొబ్బిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న వైసీపీ

● మంత్రి అనగాని సత్యప్రసాద్


మంచికలపూడిలో మహిళకు కరపత్రం పంపిణీ చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

దుగ్గిరాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రప్పా.. రప్పా నరుకుతామని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వైసీపీకి భవిష్యత్‌లో ఉనికి కూడా లేకుండా తుడిచిపెట్టుకుపోతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంపై కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ, వైసీపీ అరాచకాలను కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని, మంత్రి నారా లోకేశ్ కృషితోనే పెద్ద ఎత్తున పరిశ్రమలు రాష్ట్రానికి తరలివస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో సూపర్‌సిక్స్ పథకాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నామన్నారు. మంత్రి అనగానికి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఎంపీపీ షేక్ జబీన్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, గూడూరు వెంకట్రావు, తమ్మిశెట్టి జానకీదేవి, మరీదు రాము, ఏమినేని కోటేశ్వరరావు, యార్లగడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టెడన్నం పెట్టేందుకే అన్న క్యాంటీన్

ఎమ్మెల్యే ఆనందబాబు


అన్న క్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు అన్న క్యాంటీన్ నిర్మాణం చేస్తున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రం భట్టిప్రోలులోని బౌద్ధస్థూపం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 42 సంవత్సరాల క్రితం టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు పేదల ఆకలి తీర్చేందుకు కిలో బియ్యం రూ.2 లకే పథకం ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రి కూడా ఆదర్శంగా తీసుకుని అమలు చేశారన్నారు. జనతా వస్త్రాల పేరుతో వస్త్ర పంపిణీ కార్యక్రమానికి సైతం ఆయనే శ్రీకారం చుట్టారన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నగర, పట్టణ ప్రాంతాల్లో పేదలు, కూలీల కడుపు నింపేందుకు 219 అన్న క్యాంటీన్‌లు ప్రారంభం చేయడం జరిగిందన్నారు. అవి ఎంతో ప్రజాధరణ పొందాయన్నారు. కేవలం రూ.5లకే రుచి, శుచి కలిగిన అల్పాహారం, నాణ్యమైన భోజనం అన్న క్యాంటీన్ ద్వారా అందించి పేదల ఆకలి తీర్చారన్నారు. అక్టోబరు 2వ తేదీ నాటికి అన్న క్యాంటీన్ నిర్మాణం పూర్తి చేసి పేదలకు అందు బాటులోకి తీసుకు రానున్నట్లు ఎమ్మెల్యే ఆనంద్‌బాబు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, బుచ్చి రాంప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, జడ్పీటీసీ ఉదయభాస్కరి, తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పూర్ణచందుకు 'సాహితీసింధు' పురస్కారం


సాహితీసింధు పురస్కారం అందుకుంటున్న డాక్టర్ జీవీ పూర్ణచందు

నరసరావుపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి) : నరసరావుపేటలో 13వ తేదీ నుంచి 3 రోజులపాటు జరుగుతున్న విద్వత్ సభలలో సోమవారం 2వరోజు కార్యక్రమంలో ప్రసిద్ధ సాహితీవేత్త, పరిశోధకులు, భాషోద్యమ ప్రముఖులు డాక్టర్‌జీవీ పూర్ణచందుని 'సాహితీసింధు' బిరుదుతో సత్కరించారు. 150 గ్రంథాలు రచించి తెలుగు భాషకు తెలుగు సంస్కృతికి వారు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందిస్తున్నట్లు పలువురు వక్తలు తెలిపారు. ప్రసిద్ధ పంచాంగ కర్తలు బుర్రా వెంకటేశ్వర శర్మ, బుట్టే వీరభద్ర దైవజ్ఞ, ఇంద్రకంటి ప్రసాదశర్మ సిద్ధాంతి, చల్లా శ్రీనివాస శర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రపతి బహుమతి గ్రహీత డాక్టర్ పీటీజీవీ రంగాచార్యులు సభను నిర్వహించారు.

53,846 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 56,583 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,846 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 5,945 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	10800
334	9500	13000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13300	334	9500	12600
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13400	273	---	----
4884	---	----	341	10000	13500
సూపర్ 10	----	----	4884	---	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13500	తేజ	10000	13400
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	12600
బ్యాడిగి	10000	12400	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4800	7000

జన సైనికుల సహనాన్ని పరీక్షించవద్దు

● జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె హెచ్చరిక



సమావేశంలో మాట్లడుతున్న గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నాని అహంకారంతో సీఎం, డిప్యూటీ సీఎంపై అవాకులు చెవాకులు పేలుతున్నారని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. పేర్ని నానికి జనసేన తరఫున ఇదే చివరి హెచ్చరికని, భవిష్యత్తులో మరోసారి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సోమవారం అమరావతి రోడ్డులోని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చేస్తూ, మరో పక్కన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తోందన్నారు. వైసీపీ నాయకులు ఇది తట్టుకోలేక రాష్ట్రంలో అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గోడౌన్లో రేషన్ బియ్యం పట్టివేతకు సంబంధించి కేసులో పేర్ని నాని ఉన్నారని, తన ఇంట్లో వాళ్ళను కూడా ఆయన అవినీతిలో భాగస్వామ్యం చేశారని గాదె ఎద్దేవా చేశారు. నాడు సీఎం చంద్రబాబు వారి ఇంట్లో వాళ్ల జోలికి వద్దని చెప్పడంతో ప్రెస్ మీట్ పెట్టి మరి ముఖ్యమంత్రిని పొగిడిన పేర్ని నాని.. ఇప్పుడు అదే ముఖ్యమంత్రిపై అసందర్భ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ముసలి వ్యక్తి అని, ఇంకెన్ని రోజులు ఉంటారని పిచ్చి వాగుడు వాడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని రాష్ట్రానికి ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నాయకులు అడపా మాణిక్యాలరావు, బిట్రగుంట మల్లిక, చట్టాల త్రినాథ్, కాటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు

లక్నోలో శిక్షణ తరగతులకు మక్కెన

● రాష్ట్రంలోని డీసీసీబీ చైర్మన్‌లతో కలిసి పర్యటన


లక్నో పర్యటనలో ఆప్కో చైర్మన్ వీరాంజనేయులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ఉత్తరప్రదేశ్‌లోని లక్నో పర్యటనకు వెళ్లారు. పరిపాలనా, నాయకత్వం, సహకార విభాగంలో అభివృద్ధి వంటి అంశాలపై మూడు రోజుల పాటు జరుగనున్న శిక్షణ తరగతులకు ఆయన రాష్ట్రంలో డీసీసీబీ చైర్మన్లతో కలిసి హాజరయ్యారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, డీసీసీబీ చైర్మన్, ఇద్దరు సీనియర్ అధికారులు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులకు హాజరుకానున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, జులై 14, (ఆంధ్రజ్యోతి), శావల్యాపురం వెల్లలచెరువు రైల్వేస్టేషన్ మధ్య రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. నర్సరావుపేట రైల్వే ఎస్ఐ తెలిపిన వివరాలు.. రైలు నుంచి జారిపడి బలమైన గాయాలు తగిలి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుడు ఎరుపు రంగు చొక్కా, సిమెంట్ రంగు స్వెట్టర్, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి, మెడలో ఏసుక్రీస్తు శిలువగల దండ ధరించి ఉన్నాడన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు నరసరావుపేట రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. మృత దేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి కత్తిపోట్లు

వెదురు బొంగులు దగ్ధంపై వాగ్వాదం

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జూలై14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేజెండ్ల గ్రామంలో పంట పొలాల్లో వెదురు బొంగులు తగలబడిన ఘటనకు సంబంధించి చెలరేగిన వివాదంలో ఇద్దరు వ్యక్తులు కత్తిపోట్లకు గురైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. చేబ్రోలు పోలీసులు, స్థానికులు కథనం ప్రకారం వేజెండ్ల గ్రామంలో తూమాటి సుమన్ అనే వ్యక్తి పొలంలో వెదురుబొంగులు తగలబడ్డాయి. గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద గ్రామస్తులతో ఈ విషయం చర్చిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి.. బొంగులు తగలబడటానికి తానే కారణమని ఊర్లో ప్రచారం చేస్తున్నావంటూ సుమన్‌తో ఘర్షణకు దిగాడు. అంతేకాకుండా.. వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశారు. దుర్గా ప్రసాద్ దాడిలో సుమన్ మోచేతికి నడుము భాగానికి కత్తిపోట్లకు గురయ్యాడు. దీంతో సుమన్ బంధువైన తోమాటి పృథ్వీ సుమన్‌ను రక్షించే ప్రయత్నంలో కత్తిపోట్లుకు గురయ్యాడు. స్థానికులు కేకలు వేయగా దుర్గా ప్రసాద్ అక్కడ నుంచి పారిపోయాడు. స్థానికులు ఆటోలో వడ్లమూడిలోని ప్రైవేటు ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. సుమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్సైడి వెంకట కృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అంతర సాగుతో పత్తిలో నష్ట నివారణ

ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త వెంకట రాములు

గుంటూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా సాగయ్యే పత్తి పంటలో నష్టాల నివారణకు అంతర పంటల సాగు చక్కని పరిష్కారం అని లాం ఫాం ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు పత్తి పంటను తీవ్రంగా దెబ్బతీస్తాయని, తద్వారా రైతులు నష్టాల్లోకి వెళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. ఇటువంటి పరిస్థితులు ఎదుర్కోవాలంటే అంతర పంటల సాగు మాత్రమే మంచి పరిష్కారం అని పేర్కొన్నారు. పత్తిలో పప్పు జాతి పంటలను సాగు చేస్తే నేలలో సారం పెరిగి ప్రధాన పంట పెరుగుదలలో దోహ దపడుతుందని అన్నారు. ఈ అంతర పంటలు చీడపీడలను ఆకర్షించి ప్రధాన పంటకు నష్టం వాటిల్లకుండా కాపాడతాయని తెలిపారు. అంతర సాగుకు అనువైన పంటలను వివరించారు. కంది, సోయా బీన్, పెసర, మినుము పంటలను కూడా సాగు చేసుకోవచ్చునన్నారు. రైతులు అనుమానాల నివృత్తి కోసం ఏరువాక కేంద్రంలో సంప్రదించవచ్చునని కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకట లక్ష్మీ సూచించారు.

పల్లెకు 'ఉపాధి' పండగ!

(5వ పేజీ తరువాయి)

నిధుల జమకు సంబంధించి కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయని వాటి పరిష్కారంపై కూడా దృష్టి సారించినట్లు యంత్రాంగం చెబుతోంది. ఆయా బ్యాంకుల ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు మారడం, గతంలో ఇచ్చిన ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడం వంటి కారణాలతో నిధులు విడుదల చేసినా తిరస్కరణ అయినట్లు తెలిపారు. త్వరలోనే వారి ఖాతాల్లో కూడా నిధులు జమ చేయడానికి కసరత్తు జరుగుతోంది.

ఈ ఏడాది చివరి నాటికి

గ్రామ సభలతో పాటు పల్లె పండుగ సమావేశాల వేదికపై గ్రామస్థులు ఇచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించే దిశగా కార్యాచరణ రూపొందించుకుని అడుగులేసేలా ఆయా విభాగాలకు ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. ఈ ఏడాది చివరి నాటికి పల్లెల్లో మౌలిక వసతుల సమస్య అనే మాటే ఉండకూడదనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. దీనికి అనుగుణంగానే ఆయా నియోజకవర్గాల్లో తయారు చేయబోయే విజన్ ప్రణాళికల్లో కూడా ఉపాధి హామీ పనుల అనుసంధానంతో పూర్తయ్యే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా ప్రభుత్వం అడుగులేస్తోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	98, 107, 118
చికెన్ విత్ స్కిన్(కిలో)	190.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	200.00



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా అర్జీలను సంబంధితాధికారులకు పంపించి వారితో మాట్లాడి వెంటనే పరిష్కారమార్గం చూపించాలని ఆదేశించారు. విద్యుత్, నీటిసరఫరా, పింఛన్‌లు, రేషన్ కార్డులు, రహదారి సమస్యలు తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై ఎమ్మెల్యే స్పందించారు. ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని ఆయన సూచించారు. ప్రజలు సమస్యలు పరిష్కరించటమే తన ప్రధాన కర్తవ్యమని చెప్పారు. ఆర్టీసీ డిపో సిబ్బంది, యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను కలిసి డిపోలో నెలకొన్న సమస్యలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపిస్తానన్నారు. ఈనెల 25న రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి బాపట్ల వస్తున్న సందర్భంగా సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం చేస్తానని హామీనిచ్చారు. టీడీపీ నాయకుడు జిట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజు నియామకం హర్షణీయం : వేగేశన

ప్రజా సేవకు మారుపేరుగా నిలిచిన తెలుగుదేశంపార్టీ సీనియర్‌నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించటం హర్షణీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. నిబద్ధత, రాజనీతికి నిలువుటద్దంగా అశోక్‌గజపతిరాజు నిలిచారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకే కాక తెలుగువారికి దక్కిన గౌరవమన్నారు. ఆయన నియామకం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, పాలనా పరమైన పరిజ్ఞానం గోవా రాష్ట్రాభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తాయని ఎమ్మెల్యే వేగేశన అన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కర్లపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం సమ్మెటవారిపాలెం గ్రామానికి చెందిన సమ్మెట శ్రీనివాసరావు ఇల్లు ప్రమాదవశాత్తు షార్టు సర్క్యూట్ వలన దగ్ధమైంది. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సోమవారం ఇల్లును సందర్శించి వారికి వేగేశన ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌ల నియామకం

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీల ఛైర్‌పర్సన్‌లను, పర్సన్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల మండలంలోని అప్పికట్ల పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా అచంట విజయ్‌కుమార్ పర్సన్‌లుగా బోయిన కోటేశ్వరరావు,షేక్ కాలేషావలి, బేతపూడి ఛైర్‌పర్సన్‌గా గంపాల వెంకటకృష్ణారెడ్డి, పర్సన్‌లుగా బొమ్మిడి సాయిబాబు, కోట గన్నుబుడే సాహేబ్ రెడ్డి, చెరువుజమ్ములపాలెం ఛైర్‌పర్సన్‌గా చెన్నుపాటి కిషోర్‌బాబు, పర్సన్‌లుగా నంగనం సుబ్బరాజు, జంగా గాబ్రియేల్, ఈస్ట్‌బాపట్ల ఛైర్‌పర్సన్‌గా పల్లప్రోలు శంకరరావు, పర్సన్‌లుగా కోకి హరిబాబురెడ్డి, నక్కా వీరరాఘవయ్య, కంకటపాలెం పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా తాడిశెట్టి కృష్ణయ్య, పర్సన్‌లుగా పులిపాటి జేమ్స్, మద్దిబోయిన తిరుపతయ్యను నియమించారు. కర్లపాలెం మండలం చింతాయపాలెం పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా మద్దిబోయిన తిరుపతయ్య, పర్సన్‌లుగా కోసన రామయ్య, మాపు పద్మారావు, పిట్టలవానిపాలెం మండలంలోని అల్లూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా పెనుమెత్స వెంకట సత్యనారాయణరాజు, పర్సన్‌లుగా కూచిపూడి శామ్యూల్, యల్లావుల భూలక్ష్మీదేవి, మంతెనవారిపాలెం పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా కొత్తపల్లి శ్రీనివాసరాజు, పర్సన్‌లుగా పందరబోయన శ్రీనివాసరావు, బొరుగడ్డ సురేష్, కోమలి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా యు.వెంకటేశ్వరరావు, పర్సన్‌లుగా జక్రయ్య, కర్రా వందనంలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

బాపట్లరూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల రైతు బజారు ఎదురుగా వ్యాపారాలు చేస్తున్న రైతులపై చర్యలు తీసుకోవాలని బాపట్ల నందమూరి తారకరామారావు కూరగాయల చిల్లర వర్తక సంఘం సభ్యులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆర్డీవోకు ఫిర్యాదును అందజేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ బాపట్ల కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న రైతుబజారులో రైతులకు దుకాణాలను ఏర్పాటు చేశారని, కాని రైతుజారులో దుకాణాలను వీడి రోడ్లపై వ్యాపారాలు చేస్తున్నారని, మార్కెట్ ముందు కూడా దుకాణాలను పెట్టి తమ వ్యాపారాలకు చాలా ఇబ్బంది కలిగిస్తున్నారని, ఉన్నతాధికారులు వీరిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

వాహనాలు తనిఖీలు చేసిన ఎస్ఐ

పిట్టలవానిపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపాలెం హైవే టోల్ ప్లాజాలో సోమవారం చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ ధ్రువీకరణ పత్రాలు లేని వాహనచోదకులకు అపరాధ రుసుం విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. ద్విచక్రవాహనాలపై వెళ్ళే వాహనచోదకులు తప్పనిసరిగా ధ్రువీకరణపత్రాలు దగ్గర ఉంచుకోవాలని, హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వారికి సూచించారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కేటాయించరాదు : ఎస్టీయూ

● ఎస్టీయూ అధ్యక్షుడిగా ముక్తేశ్వరరావు

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కేటాయించరాదని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. బాపట్ల పట్టణ శాఖ కార్యవర్గ ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా జి.ముక్తేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ రఫీ, ఆర్థిక కార్యదర్శిగా కె.రామాంజనేయులను ఎన్నుకున్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఎక్కువగా చెప్పి బోధనకు దూరంగా ఉంచుతూ విద్యారంగాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారన్నారు. యాప్‌ల భారం తగ్గించాలన్నారు. ఉపాధ్యాయవాణి జిల్లా కన్వీనర్ పీవీ.నాగరాజు మాట్లాడుతూ 78 సంవత్సరాల చరిత్ర కలిగిన ఎస్టీయూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించటంలో కృషి చేస్తూ పలువురి మన్ననలు పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నూరుబాషా సుభానీ, సీహెచ్ శ్రీనివాసరావు, పి.శివాంజనేయులు, గవిని శ్రీనివాసరావు, ఏవీ నారాయణ, యడం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ బాపట్ల పట్టణ నూతన కార్యవర్గం

బదిలీపై వెళుతున్న సచివాలయ ఉద్యోగులకు ఘనసన్మానం

పిట్టలవానిపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అంకితభావంతో విధులు నిర్వహించే ఉద్యోగులకు ప్రజలలో ఎనలేని గౌరవం దక్కుతుందని ఖాజీపాలెం సర్పంచ్ కె.అనూష ప్రసన్న అన్నారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామసచివాలయంలో సచివాలయ ఉద్యోగులుగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్న వారికి సోమవారం సచివాలయ కార్యదర్శి దాసరి వెంకటశివకుమార్ ఆధ్వర్యంలో వెల్ఫేర్ అసిస్టెంట్ పిట్టు తారకరామిరెడ్డి, మహిళా పోలీసు లక్ష్మీప్రసన్న, ఏఎన్‌ఎం అనిత, ఫిషరీస్ అధికారి జ్యోతిర్మయి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ స్వాతిలను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు కూసంపూడి దేవేంద్రరాజు, అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు, దండు శ్రీనివాసరాజు, మంతెన కృష్ణమూర్తిరాజు, గోకరాజు వర్మరాజు, దండు శివరామరాజు, గుమ్మడి సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు తక్షణమే న్యాయం జరగాలి

● జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్



అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్, సమగ్ర శిక్ష ఏపీసీ నాగిరెడ్డి తదితరులు

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : బాధితులకు తక్షణమే న్యాయం జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి బాధితులు విచ్చేసి వినతిపత్రాల ద్వారా అధికారులకు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో నమోదయ్యే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులు నిబద్ధతతో పని చేయాలన్నారు. బాధితులను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవటం మంచి పద్ధతి కాదని సూచించారు. సమస్య పరిష్కారమైన విషయాన్ని లిఖితపూర్వకంగా తెలుగులో ధ్రువీకరణపత్రాన్ని ఫిర్యాదుదారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ నాగిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించటమే లక్ష్యం : ఆర్డీవో



ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక ముఖ్యఉద్దేశ్యం ప్రజల సమస్యలను పరిష్కరించటమేనని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఆరు సమస్యలపై అర్జీలు అందాయన్నారు. రేపల్లె మండలం మోళ్ళగుంట గ్రామానికి చెందిన ధనుంజయరావు విద్యుత్ శాఖ వారు లోడు ఎక్కువగా చూపించి అధిక కరెంటుబిల్లు ఇచ్చి ఉన్నారని, విచారించి విద్యుత్ బిల్లు తగ్గించాలని కోరారు. గాదెవారిపాలేనికి చెందిన తాడికొండ వెంకటఝాన్సీలక్ష్మీబాయ్ మోళ్ళగుంట గ్రామపంచాయతీ పరిధిలో పంటభూమి కలదని, పక్కన రొయ్యల చెరువులు అక్రమంగా తీసి ఉన్నారని, వాటి వలన తమ పంటలకు నష్టం వాటిల్లుతుందని రొయ్యల చెరువులను నిలుపుదల చేయాలని కోరారు. ఆర్డీవో రామలక్ష్మి మాట్లాడుతూ వచ్చిన సమస్యలను ఆయా శాఖలతో సంప్రదింపులు చేసి పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి : ఎస్పీ



బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నిర్దిష్ట గడువులోగా అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు జిల్లా నలుమూలల నుంచి 68 మంది అర్జీల ద్వారా తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్న ఎస్పీ మాట్లాడుతూ అర్జీల విషయంలో పోలీసు అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం : ఆచంట

బాపట్లరూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం ప్రభుత్వంలోనే జరుగుతున్నదని భర్తీపూడి సర్పంచ్ ఆచంట అమరేష్ అన్నారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు భర్తీపూడి గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు ఆట్ల గోపిరెడ్డి, గరికపాటి విజయ్‌కుమార్, ఉలిచి బ్రహ్మం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం

బాపట్లరూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ, విజ్ఞాన ఫార్మసీ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న వారం రోజులపాటు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారంరోజులు పాటు సాగే ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి ఫైనలియర్ బీ ఫార్మసీ చదువుతున్న విద్యార్థులు సుమారు 250 మంది పాల్గొన్నారని తెలిపారు. ఫార్మసీ విద్య ముగించుకొని ఉద్యోగావకాశాలు పొందేందుకు ఈనైపుణ్య శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నిర్వాహకులను అభినందించారు..



మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె శిబిరం వద్ద వంటావార్పు

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం

● కార్మిక సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరం వద్ద సోమవారం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక సమస్యలపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, కె.శరత్, వై.భాస్కరరావు, కె.నాగేశ్వరరావు, తిరుమలరెడ్డి, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళకు కుట్టుమిషన్ వితరణ

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఎస్ టూ నీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని అడవిగ్రామపంచాయతీ విజయలక్ష్మీపురంనకు చెందిన కామేపల్లి చిరులేఖ స్వయం ఉపాధిని పొందేందుకు కుట్టుమిషన్ అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫౌండేషన్ డైరెక్టర్ తోట సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శిక్షకురాలు కుందేటి శివకుమారి, గుండుబోయన లక్ష్మీ, ఈతేరు శ్రీలక్ష్మీ, రాయపాటి అనూష తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శారాఫెయిత్ ఫౌండేషన్ విద్యార్థులకు బాపట్ల రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కోళ్ళపూడి ఉపేంద్రగుప్తా, జయకృష్ణసాయి నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్, మాజీ అధ్యక్షులు ఉపేంద్రగుప్తా, సాయిప్రణీత, కొల్లా శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, జిట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో ప్రజలు సామరస్యంగా జీవించాలి : ఎస్ఐ

పిట్టలవానిపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ప్రజలు సామరస్యంగా జీవించాలని చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ అన్నారు. మండలంలోని భవనవారిపాలెం గ్రామంలో స్థానిక గ్రామస్తులతో చందోలు ఎస్సై వెంకటశివకుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో యువత చెడుదారి పట్టకుండా గ్రామస్తులందరు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వాడకంపై నిఘా పెట్టాలన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

రేపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సమస్యలు, బస్సుల రాకపోకల ఇబ్బందులపై మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం ఎస్.సునిల్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో బస్సులకు సంబంధించి సలహాలు, సూచనలు ప్రయాణికుల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడునని తెలిపారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 9959225423నెంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడవచ్చని తెలిపారు.

ఉపాధ్యాయుడు మురళీమోహన్‌కు సత్కారం

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : భారత పద్మ ప్రతిభ అవార్డును అందుకున్న ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్‌ను సహఉపాధ్యాయులు సత్కరించారు. వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కె.అరుణకుమారి ఆధ్వర్యంలో అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడిని సోమవారం సత్కరించి తమ తోటి ఉపాధ్యాయుడు ప్రతిభ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.శివరామకృష్ణ, కుటుంబరావు, ఎస్టేట్‌బాబు, శ్రీనివాసరావు, శైలజ, ఆశాలత, వెంకటస్వామి, బేబి, విజయలక్ష్మి, రాణి, కిషోర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

కొల్లూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : భవిత కేంద్రంలో చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. స్థానిక గౌడపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో సోమవారం విద్యార్థులకు బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్స్, వీల్‌ఛైర్లు, వాకర్, రోలేటర్, బ్రెయిలీ కిట్స్‌ను ఎంఈవో జ్యోతి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనరాజ్, ఆంథోనమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొలాసిస్‌ను పరిశీలించిన ఎక్సైజ్ అధికారులు

వేమూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జంపని చక్కెర కర్మాగారంలో నిల్వ ఉన్న మొలసిస్ ట్యాంకును సోమవారం ఎక్సైజ్ అధికారులు పరిశీలించారు. రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సీఐ రవి, నిల్వ ఉన్న మొలాసిస్‌ను పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొలాసిస్ పరిశీలన నిమిత్తం ల్యాబ్‌కు పంపించడం జరిగిందన్నారు. షుగర్ ఫ్యాక్టరీ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు అధికారులకు అందజేయడం జరిగిందని ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు.

స్టాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ పద్మావతి

చెరుకుపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండల రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సోమవారం తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ప్రకృతి వ్యవసాయ విభాగం నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ వరదానం పరిశీలించి తగు సూచనలిచ్చారు. దేశీయ రకాల బియ్యం వలన ఉపయోగాలను స్టిక్కర్లు వేయించి డిస్‌ప్లే చేయవలసిందిగా సూచించారు.కార్యక్రమంలో రాహేలురావు, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండల గ్రామం వెల్లటూరులోని రెండు ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలను దాత నారాయణ సోమవారం అందించారు. ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుకునే 52 మంది విద్యార్థులకు వారికి అవసరమైన పుస్తకాలను మండల విద్యా శాఖాధికారి ఎం.దేవరాజు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవి, శివనాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, పున్నయ్య, కృష్ణప్రియ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విదార్థులు మంచివైపు నడవాలి : ఎంఈవో

కర్లపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుకోవాలి, ఆడుకోవాలి, సమాజంలో జరుగుతున్న విషయాలను తెలుసుకొని మంచి వైపు నడిచి ఉన్నతులుగా ఎదగాలని మండల విద్యాశాఖాధికారి విజయశ్రీ అన్నారు. కర్లపాలెం మండలం పెదగొల్లపాలెం గ్రామంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు బి.సాంబయ్య, కొల్లా శ్రీనివాసరావు, జయం వరబాబు, ప్రధానోపాధ్యాయురాలు సుభాషిణి, ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

కర్లపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సమ్మెటవారిపాలెం పంచాయతీలో సమ్మెట శ్రీనివాసరెడ్డికి చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయి బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సోమవారం ఫ్రెండ్స్ ఆదర్శయూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి, గౌరవాధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, కోశాధికారి జోగి సువర్ణ, మద్దిబోయిన గోపి, నందిపాటి శ్రీరాం, సునీల్, బండ్రెడ్డి అంకమ్మరావు, యాసం రాజా రమేష్, విన్నకోట శ్రీనివాసరావు, తన్నీరు గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్న పొన్నూరుకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థి కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు గమనించి చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఈఈ

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ జి.భాస్కరరావు తెలిపారు. పట్టణంలోని శ్రీసాయి ఫంక్షన్ ప్యాలెస్‌లో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాళ

● సంవత్సర కాలంలో గాడిలోకి తెచ్చిన ముఖ్యమంత్రి

● సుపరిపాలన తొలి అడుగులో ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళ తీయించడంతో పాటు అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విమర్శించారు. భట్టిప్రోలు మండలంలోని ఐలవరం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై గ్రామంలో ఇంటింటికి తిరిగి సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పర్యటనలో మహిళలు, విద్యార్థులను ఆప్యాయంగా పలుకరిస్తూ ఇంటింటికి తిరిగారు. అనంతరం సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైసీపీ పాలనలో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిన రాష్ట్రాన్ని సంవత్సర కాలంలో ఎన్నో కష్టాలు పడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గాడిలో పెట్టారని చెప్పారు. ఒక వైపు వైసీపీ అరాచక పాలన మిగిల్చిన కష్టాల నుంచి రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సైతం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. ఐలవరం గ్రామంలోనే సుమారు రూ.కోటి నిధులను అభివృద్ధి పనులకు కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, ఎంపీపీ ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, జడ్పీటీసీ ఉదయభాస్కరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు, మండల కన్వీనర్ శేషుబాబు, నాయకులు మాచర్ల నాగరాజు, వామనపల్లి కోటేశ్వరరావు, మోటూరి పుణ్యశ్రీనివాసరావు, జొన్నల వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఐలవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

వేమూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. గుంటూరు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుని ప్రభుత్వ ఆర్థిక సహాయం నిమిత్తంగా ఎమ్మెల్యేను అర్థించారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చుండూరు మండలం మోదుకూరుకు చెందిన తన్నీరు నాగలక్ష్మీ, కార్మూరువారిపాలెం గ్రామానికి చెందిన వజ్రాల వెంకటేశ్వరరెడ్డి, అమృతలూరుకు చెందిన వెలుగోలు శ్రీధర్‌బాబు, తాతా భానువెంకటప్రసాద్, వెల్లుల్లి జయశ్రీ, పెదపూడికి చెందిన షేక్ నన్నేషా, కుక్కల యేసుమణి, వేమూరు మండలం బూతుమల్లికి చెందిన రావులపాటి విజయలక్ష్మి, కొల్లూరు మండలం పెసర్లంకకు చెందిన తోట శివపార్వతి, కిష్కిందపాలేనికి చెందిన కొల్లి రంగారావు, క్రాప గ్రామానికి చెందిన తరణి నాగరాణి, కొల్లూరుకు చెందిన నూకల వెంకటేశ్వరరెడ్డి, గరికపాటి వాణి కుమారులకు రూ.5,22,297ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే ఆనందబాబుకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



అనగాని శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన చింతల సుబ్బారావు

రేపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నగరం పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన చింతల సుబ్బారావు సోమవారం మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాకప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ నగరం సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నుకోవటంపై ఆయనకు రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన ఎరువులను సకాలంలో అందిస్తూ రుణసదుపాయాలను సమకూరుస్తూ అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగరం టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉభయ రామేశ్వర క్షేత్ర అభివృద్ధికి నిధులు మంజూరు

కొల్లూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఉభయ రామేశ్వర క్షేత్ర అభివృద్ధికి రూ.2.93 కోట్ల నిధులు మంజూరైనట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ తెలిపారు. చిలుమూరు గంగా పార్వతి సమేత రామేశ్వరస్వామి, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానం అభివృద్ధి, రాబోయే కృష్ణా పుష్కరాల కోసం కూటమి ప్రభుత్వం రూ.2 కోట్ల 93 లక్షలు అంచనాలు పంపగా మొదటి విడతగా రూ.73 లక్షలు విడుదలు కావడం జరిగిందని, ఆయా దేవస్థానాల వ్యవస్థాపక ధర్మకర్త హరి దుర్గానాగేశ్వరరావుకు సోమవారం తెలిపారు. 2016లో కూడా టీడీపీ ప్రభుత్వం రూ.73 లక్షల నిధులు విడుదల చేయడం జరిగిందని, వైసీపీ ప్రభుత్వంలో మాత్రం దేవాలయాల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విడుదలకాక ఇబ్బందులు పడ్డామని వ్యవస్థాపక ధర్మకర్త పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే ఆనందబాబు, మైనేనిలతో పాటు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి రాంనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెదపూడి నాగరాజు, యడ్ల శ్రీనివాస్, గాదె చంటి, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దేవాలయ నిధుల మంజూరు పత్రాన్ని మురళీకృష్ణ నుంచి సేకరిస్తున్న హరిదుర్గానాగేశ్వరరావు

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను కూటమిప్రభుత్వం తక్షణమే పరిష్కరించి ఆదుకోవాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేశారు. అయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, నాయకులు డి.ప్రభాకరరావు, ఎన్.రవి, కె.రాఘవేంద్రరావు, సుబ్బారావు, గీత, అనూష, ఎన్.కిరణ్, పి.మనోజ్, కె.రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్‌డీఎస్ఎస్ స్కీమ్ ద్వారా విద్యుత్ లైన్ల అభివృద్ధి కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్‌శాఖ డీఈఈ డి.శ్యామ్‌సుధాకర్‌బాబు తెలిపారు. పట్టణంలోని 10వవార్డు, అరవపల్లి రోడ్డు, ఏకలవ్య బొమ్మసెంటర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.



అడ్డగోలు.. అనుసంధానం!

- విద్యుత్ సర్వీసు ఒకరిది.. ఆధార్ మరొకరిది
- మీటర్ రీడింగ్ పెరిగితే.. సంక్షేమ పథకాలు కట్.. ● నష్టపోతున్న లబ్ధిదారులు
- పల్నాడులో ఒక సర్వీసు నంబరుకు 150 ఆధార్ లింకులు.. ● పట్టించుకోని విద్యుత్ యంత్రాంగం

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యధికంగా విద్యుత్ సర్వీస్ నంబర్లకు అడ్డగోలుగా ఆధార్ కార్డు లింక్‌లు చేయడం వివాదాస్పదంగా మారుతోంది. ఇటీవల పల్నాడులోని వినుకొండలో ఓ వినియోగదారుడి విద్యుత్ సర్వీసుకు ఏకంగా 150 ఆధార్ కార్డులు లింక్ అవడం చర్చనీయాంశంగా మారింది. విద్యుత్ సర్వీస్ నంబర్లకు ఆధార్, ఫోన్ నంబర్లు లింక్ చేయాలన్న నిబంధన పక్కాగా అమలు చేయాల్సి ఉంది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ అసలు సర్వీస్ తీసుకొన్న వినియోగదారుడి ఆధార్ నంబరు కాకుండా.. సంబంధం లేనివారిని లింక్ చేయడమే వివాదాస్పదమవుతోంది. ఒక్కో సర్వీస్ నంబర్‌కు మూడు నుంచి ఐదు, పది ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఆధార్ నంబర్లు అనుసంధానమై ఉండటం ఇటీవల వెలుగు చూస్తున్నాయి.

సంక్షేమ పథకాలకు ఎసరు..

సంక్షేమ పథకాల అమలుకు లబ్ధిదారుల విద్యుత్ మీటర్ రీడింగ్‌ను కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటోంది. ఏడాదిలో సరాసరి 3,600 యూనిట్లు దాటి వినియోగం జరిగితే వారికి పలు పథకాలు వర్తించే పరిస్థితి లేదన్నట్లు అధికారులు చెబుతున్నారు. సర్వీసుకు వేర్వేరు ఆధార్ నంబర్లు అనుసంధానమై.. అనేక మంది లబ్ధిదారులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఇటీవల విద్యుత్ సర్వీస్ కనెక్షన్‌లకు వేరొకరి ఆధార్ నంబర్లు అనుసంధానం కావడంతో.. తల్లికి వందనం పథకం లబ్ధికి అర్హులు దూరమైన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యుత్ శాఖ ఈఆర్వో కార్యాలయాలకు లబ్ధిదారులు పరుగులు పెట్టారు. అయితే విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం.. 'మాకు సంబంధం లేదు అనుసంధానమైన.. సర్వీస్ వినియోగదారుల ఆధార్ కార్డులు మీరే తీసుకురండి' అం టూ తీరిగ్గా, ఉచిత సలహాలు ఇస్తున్నారు.

> ● ఈ అనుసంధానం వెనుక ఆంతర్యమేమిటో..?
>
> మంగళగిరి సెక్షన్ పరిధిలో దొంతిరెడ్డి శివరామిరెడ్డి పేరుతో ఉన్న విజయ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ విద్యుత్ సర్వీస్‌కు మాజీ ఎంపీ నందిగం సురేష్ కుటుంబ సభ్యుల ఆధార్ నంబరు అనుసంధానమై ఉండటం చర్చనీయాంశంగా మారింది. అలాగే దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పట్టించుకోని యంత్రాంగం

విద్యుత్ సర్వీస్ నంబర్లకు అడ్డగోలు ఆధార్ కార్డులు, ఫోన్ నంబర్ల లింక్‌లపై విద్యుత్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ఉదాసీనత, క్షేత్ర స్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యంతో అడ్డగోలుగా ఆధార్ నంబర్లు అనుసంధానం అయ్యాయన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు.. క్షేత్రస్థాయిలో సిబ్బంది సాయంతో విద్యుత్ సర్వీస్‌లకు అడ్డగోలుగా ఉన్న ఆధార్ కార్డులను తొలగించి సక్రమంగా నిర్వహించాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మన మిత్రతో.. అన్నదాత సుఖీభవ



- అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేదా..?
- ఆందోళన అవసరం లేదు.. మన మిత్ర ఉంది..
- వాట్సాప్ నంబరుకు హాయ్ పెడితే చాలు..
- ఎందుకు అనర్హులయ్యారో వెంటనే సమాచారం
- రైతులకు రియల్ టైమ్ గవర్నెన్స్: డీఏఓ నాగేశ్వరరావు



గుంటూరు సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోతే కారణం తెలుసు కోవడం అతి సులభమని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చే రూ.6వేలతో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇవ్వడం జరుగుతుంది. రైతు సేవా కేంద్రాల్లో అర్హుల జాబితా ఇప్పటికే ప్రదర్శించారు. రైతులు వాటిని పరిశీలించి తమ పేరు ఉందో లేదో చూసు కోవాలి. అర్హత ఉండి.. జాబితాలో తమ పేరు లేకపోతే.. ఖంగారు పడకుండా.. అందుకుగల కారణాన్ని వెంటనే తెలుసుకోవచ్చు. ఇందుకు చేయాల్సిందల్లా.. రాష్ట్ర ప్రభుత్వం రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా తీసుకొచ్చిన మన మిత్ర వాట్సాప్ నంబరు హాయ్ పెడితే చాలు.

గుంటూరు జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా 2,64,566 మంది రైతులు ఉండగా 2,21,317 మంది రైతులకు ఈ-కేవైసీ పూర్తయింది. మిగి లిన రైతులకు వివిధ కారణాలతో ఈకేవైసీ కాలేదు. వివరాలకు వ్యవసాయ అధికారి టెక్నికల్ నంబర్ 83310 56914కు కాల్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

ప్రధానంగా ఎదురయ్యే సమస్యలు..

- భూమి లేని బీసీ, ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు, కౌలు గుర్తింపు కార్డులు పొందాలి. ఖరీఫ్ పంటల వివరాలు నమోదు చేసుకోవాలి. అర్హులకు రూ.20 వేలు సాయాన్ని మూడు విడతల్లో అందజేస్తారు.
- డి-పట్టాదారులు, అసైన్డ్, ఈనాం భూములు సాగు చేసేవారందరూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులే. కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుంది. కుటుంబం నుంచి విడిపోయి వేరుగా ఉంటే.. కుటుంబ సర్వేలో వేరు చేయించుకోవాలి.
- వెబ్ ల్యాండ్‌లో రైతు ఆధార్ నంబరు తప్పుగా అనుసంధానం చేసి ఉంటే రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి సరైన ఆధార్ నంబరును అనుసంధానం చేయించుకోవాలి.
- వెబ్ ల్యాండ్‌లో ఆధార్‌తో జత కాలేదని గుర్తించినా.. చనిపోయిన వారి భూమి మ్యుటేషన్ జరగకపోయినా, వెబ్ ల్యాండ్‌కు సంబంధించిన కారణాలు ఏమైనా ఉంటే వీఆర్వో, తహసీల్దారు ద్వారా సరిచేసుకోవాలి. అనంతరం రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి.
- అటవీ భూమి సాగుదారులు.. గిరి భూమి పోర్టల్లో సమస్యలు ఉంటే గిరిజన సంక్షేమ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి, ఆధార్ తప్పుగా నమోదైనా మ్యుటేషన్ కోసం పీఓను సంప్రదించి సరిచేసుకోవాలి.
- రైతుల పేర్లు పరిశీలనలోకి రాలేదంటే వారి భూమి రెవెన్యూ వెబ్ ల్యాండ్, ఆధార్ జతకాలేదని గుర్తించాలి. రెవెన్యూ అధికారిని సంప్రదించి ఆధార్‌ను వెబ్ ల్యాండ్ రికార్డులతో అనుసంధానం చేసుకుని అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. దేవాదాయ భూముల్లో సాగు చేస్తున్న వారిని కౌలు రైతుల కింద గుర్తించి పెట్టుబడి సాయం అందిస్తారు.

ఏం చేయాలి..

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో పేరు లేని రైతులు మన మిత్ర (95523 00009) వాట్సాప్ నంబరుకు తమ ఫోన్ నుంచి హాయ్ అని సందేశం పంపాలి. అందులో మొదటి వరసలో ఉండే అన్నదాత సుఖీభవ సేవపై క్లిక్ చేసి ఆధార్ నం బర్ నమోదు చేయాలి. దీంతో వెంటనే లబ్ధిదారుని పేరు, తండ్రి పేరు, గ్రామం, మండలం మొదలగు సమాచారం వస్తుంది. అందులో పథకానికి అర్హులా, అనర్హులా అని కూడా తెలుస్తుంది. అనర్హులైతే.. అందుకు కారణం కూడా పొందు పరచడం జరుగుతుంది. ఈకేవైసీ పూర్తయిందా లేదా అనే వివరాలు కూడా వస్తాయి. కారణం తెలుసుకొని అవసరం అయిన పత్రాలు అందజేస్తే వ్యవసాయ శాఖ సిబ్బంది సమస్యను వెంటనే పరిష్కరిస్తారు.

హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయికి విజయలక్ష్మి అవార్డు



తెనాలి అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు న్యాయమూర్తి వెంకటజ్యోతిర్మయి ప్రతాపను విశ్రాంత దివంగత ఉపాధ్యాయిని మొవ్వా విజయలక్ష్మి స్మారక అవార్డుతో సత్కరించనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మొవ్వా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏడేళ్లుగా ఈ అవార్డును ప్ర ముఖులకు అందజేస్తున్నారు. విజయలక్ష్మి పేరిట సత్యనారాయణ పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఈ నెల 19న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పదవ తరగతిలో 550కి పైగా మార్కులు సాధించిన 60 మందికి ఒక్కొక్కరికి రూ.ఐదు వేలు చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ ఏడాది పురస్కారాన్ని గౌరవ న్యాయమూర్తికి ప్రదానం చేస్తారు. విద్యార్థులు-భవిష్యత్ సవాళ్లు అనే అంశంపై ఆమె స్మారకోపన్యాసం చేస్తారు. తెనాలిలో జన్మించిన జస్టిస్ జ్యోతిర్మయి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేశారు. పలుమార్లు బంగారు పతకాలు అందుకున్నారు. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. 1997లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు అయి అంచలంచలుగా హైకోర్టు న్యాయమూర్తిగా ఎదిగారు. జాతీయ న్యాయ సేవా సంస్థకు థీమ్ సాంగ్‌ను కూడా రచించారు. సైబర్ క్రైమ్‌పై శిక్షకురాలిగా పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె సేవలను గుర్తించిన విజయలక్ష్మి స్మారక సేవా సంస్థ ఈ అవార్డును ఎంపిక చేసిందని సత్యనారాయణ తెలిపారు. అవార్డు ప్రదానోత్సవంలో జేఎన్‌టీయూ కాకినాడ వీసీ శివరామకృష్ణప్రసాద్, దళిత యూనివర్శిటీ వీసీ గుజ్జర్లమూడి కృపాచారి, డీఎస్పీ జనార్దనరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఏఎస్ఎన్ ప్రిన్సిపల్ రాంచంద్ పాల్గొంటారని తెలిపారు.

రూ. 60.17 లక్షల విత్తన అమ్మకాలు నిలిపివేత

- గుంటూరులో విజిలెన్స్ దాడులు

గుంటూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీదారులు, టోకు వర్తకులు, రిటైల్ డీలర్ల దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. రెండు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 60.17 లక్షల విలువైన మిరప, సోయాబీన్ విత్తనాల అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశించారు. అదేవిధంగా రూ. 1.66 లక్షలు విలువ చేసే ఎరువులు, రూ. 14.13 లక్షల విలువ చేసే 3,460 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు వెల్లడించారు. సరైన పత్రాలు లేనందున అమ్మకాలు నిలిపి వేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పశ్చిమ గోదావరి జిల్లా ఏడీఏ పి.మురళీ కృష్ణ, క్రిష్ణా జిల్లా ఏడీ ఏఎం సునీల్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు కె.వెంకటేశ్వర్లు, సీహెచ్ రవిబాబు, గుంటూరు రూరల్ వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్ కుమార్ పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు



ఏజెంట్ల మాయా జాలం

తత్కాల్ టిక్కెట్‌లు రైల్వేలో హాట్ కేకుల్లా బుకింగ్ అయిపోతుంటాయి. ఇందుకు ప్రధాన కారణం లైసెన్సు కలిగిన ఏజెంట్లు, కొంతమంది ఇంటర్‌నెట్ సెంటర్ల నిర్వాహకులు ఎవరెవరివో ఈ-మెయిల్స్, మొబైల్ నంబర్ల ద్వారా యూజర్ ఐడీలు నమోదు చేసి, ఎక్కువ స్పీడ్ కలిగిన ఇంటర్నెట్ సదుపాయంతో టిక్కెట్‌లు బుకింగ్ చేస్తుంటారు. దీంతో ఐఆర్‌సీటీసీ యూజర్లతో పాటు పీఆర్ఎస్ కౌంటర్లలో బుకింగ్ చేసుకోవడానికి వెళ్లిన సామాన్యులకు తత్కాల్ వెయిటింగ్ లిస్టు ప్రత్యక్షమవుతుంది. తత్కాల్ అవుతుండగానే ప్రీమియం తత్కాల్ టిక్కెట్లను కూడా బుకింగ్ చేస్తున్నారు. దీనిపై రైల్వే శాఖకు కొన్నేళ్లుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

తత్కాల్ బుకింగ్‌కి.. ఓటీపీ!

- రిజర్వేషన్‌కు ప్రామాణీకరణ తప్పనిసరి
- నేటి నుంచే పీఆర్ఎస్ కౌంటర్లు, ఐఆర్‌సీటీలో అమలు
- ఏజంట్లకు అరగంట తర్వాతే బుకింగ్ అనుమతి
- ఆపరేషన్ ఉపలబ్ధ్ పేరుతో ఆర్‌పీఎఫ్ నిఘా



గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైల్వే తత్కాల్ టిక్కెట్ల బుకింగ్‌లో ఆ శాఖ చేసిన సవరణలు మంగళవారం నుంచి అమలులోకి రానున్నాయి. ఐఆర్‌సీటీసీ యాప్, లైసెన్సు కలిగిన ఏజంట్లు, ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం(పీఆర్ఎస్) కౌంటర్లలో తత్కాల్ టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోవాలంటే సమర్పించిన మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీని ప్రామాణీకరణ తప్పనిసరిగా చేయాలి. అప్పుడే టిక్కెట్ రిజర్వు అవుతుంది. దీని వల్ల టిక్కెట్ బుకింగ్‌కు కొంత సమయం పెరిగే అవకాశం ఉంది. ఐఆర్‌సీటీసీ యాప్ /వెబ్‌పోర్టల్ వినియోగదారులైతే ఆధార్ ఆధారిత ఓటీపీని నమోదు చేస్తేనే టిక్కెట్ బుకింగ్ అవుతుంది. లైసెన్సు కలిగిన ఏజంట్లు తత్కాల్ బుకింగ్స్ ప్రారంభమైన అరగంట వరకు లాగిన్ చేసుకోలేరు. ఈ క్రమంలో ఏమైనా అడ్డదారులు తొక్కేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు చేపట్టేందుకు ఆర్‌పీఎఫ్ ఆపరేషన్ ఉపలబ్ధ్ పేరుతో ఆకస్మిక దాడులకు ఉపక్రమించింది.

ఓటీపీ నమోదు తప్పనిసరి

ఎట్టకేలకు రైల్వే శాఖ తత్కాల్ స్కీమ్‌లో కొన్ని మార్పులు చేసి నేటి నుంచి అమలులోకి తీసుకురానుంది. ఇప్పటికే ఐఆర్‌సీటీసీ యాప్ వినియోగించే యూజర్లకు ఆధార్‌తో అథెంటికేషన్ చేయించింది. ఆధార్ అథెంటికేషన్ లేకపోతే టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోవడానికి అవకాశం లేకుండా చేసింది. తాజాగా యాప్/ పోర్టల్ ద్వారా టిక్కెట్‌లు బుకింగ్ చేయదలిచిన యూజర్లు ఆధార్ ఆధారిత ఓటీపీని అథెంటికేషన్ చేస్తేనే తత్కాల్ టిక్కెట్ బుకింగ్ జరుగుతుంది. పీఆర్ఎస్ కౌంటర్లకు వెళ్లి ఫాంలు నింపి బుకింగ్ చేసుకొనే ప్రయాణికులు అందులో తప్పనిసరిగా మొబైల్ నంబరుని నమోదు చేయాలి. ఆ నంబరుకు వచ్చే ఓటీపీని బుకింగ్ క్లర్కుకు చెబితేనే టిక్కెట్ బుకింగ్ జరుగుతుంది. లైసెన్సు పొందిన ఏజంట్లు ఏసీ తరగతుల టిక్కెట్‌లు అయితే ఉదయం 10.30, నాన్ ఏసీ తరగతుల టిక్కెట్లను 11.30 గంటల నుంచి మాత్రమే బుకింగ్ చేయగలరు. అది కూడా ప్రయాణికుడి మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీని ప్రామాణికరణ చేసిన తర్వాతనే. కాగా, గత రెండు రోజుల నుంచి ఆపరేషన్ ఉపలబ్ధ్ పేరుతో ఆర్‌పీఎఫ్ సిబ్బంది గుంటూరు రైల్వే డివిజన్‌లో పలుచోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళగిరిలోని యోహిత డిజీ సర్వీసెస్‌లో తనిఖీలు నిర్వహించి ఐదు లైవ్ ఈ టిక్కెట్‌లు, వినియోగించిన ఈ-టిక్కెట్లను సీజ్ చేశారు. వీటి విలువ రూ. 76,715గా పేర్కొన్నారు. అలానే మరో రైల్వేస్టేషన్‌లో రెండు లైవ్ టిక్కెట్లను సీజ్ చేశారు. నరసరావుపేటలో ఆపరేషన్ రైల్ ప్రహరీ నిర్వహించి, ఒక నకిలీ టీటీని అరెస్టు చేశారు.

మంత్రితో మీటింగ్ ఏర్పాటు చేయాలి

ఏపీ ఎంసీప రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్

గుంటూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న పది వేల మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలపై చర్చించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. తమ హక్కుల సాధన కోసం 40 రోజుల పాటు సమ్మె చేస్తే వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులు కొన్ని హామీలు ఇచ్చి దాన్ని విరమింపజేశారని పేర్కొన్నారు. అందులో ప్రధానమైన హామీ ఆరోగ్య శాఖ మంత్రితో సమావేశం ఏర్పాటు అని గుర్తుచేశారు. సమ్మె విరమించి మూడు నెలలు దాటినా అధికారులు సమావేశం ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా.. మంత్రితో సమావేశం ఏర్పాటు చేసి, పెండింగ్ ప్రోత్సాహకాలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రోత్సాహకాలు రాకపోవడంతో పిల్లలకు పాఠశాల ఫీజులు కూడా చెల్లించలేక పోతున్నామని ఏపీ ఎంసీప రాష్ట్ర కార్యదర్శి బిర్రు సందీప్ ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను టాటా డీఐఎస్‌సీ ప్రైవేట్ కంపెనీకి కేటాయిస్తామని చెప్పడం కూడా ఆందోళన కలిగిస్తోందన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ గురించి మొదట తమతో మాట్లాడాలన్నారు. ఈ అనుమానాల నివృత్తి కోసం మంత్రితో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

సీఆర్డీఏ ఆధీనంలోకి ఇసుక క్వారీలు..!

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నగరంలో నిర్మాణ పనులు ఊపందుకోవడంతో ఇసుక కొరత రాకుండా ఉండేందుకు మున్సిపల్ పరిపాలన శాఖ ముందుచూపు చర్యలు చేపట్టింది. కృష్ణానది తీరం వెంట ఇరువైపులా ఉన్న ఇసుక రీచ్‌లన్నింటిని ఏపీ సీఆర్‌డీఏ ఆధీనంలోకి తీసుకొనేందుకు ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేయగా .. పురపాలక శాఖ దానికి రాజముద్ర వేసింది. దాదాపుగా రూ.286 కోట్ల అంచనా విలువతో ఏజెన్సీని త్వరలో ఎంపిక చేసి ఇసుకని బయటకు తీసే బాధ్యతని కేటాయించనుంది. ఇందుకోసం అవసరమైన అన్ని అనుమతులను ఏపీ సీఆర్‌డీఏ తీసుకొనేలా నిబంధనల్లో సవరణలు కూడా జరిగాయి.

- రాజధాని అవసరాలకు ఇబ్బంది లేకుండా చర్యలు




దీంతో ఇసుక రేవులన్ని కొద్ది రోజుల్లోనే సీఆర్‌డీఏ ఆధీనంలోకి వెళ్లిపోనున్నాయి. నదిలో నుంచి తీసిన ఇసుక మోతాదు, విక్రయించగా వచ్చిన నగదుని జిల్లా స్థాయి ఇసుక కమిటీ పర్యవేక్షిస్తుంది.

భారీ మోతాదులో ఇసుక అవసరాలు

సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ ద్వారా రాజధానిలో వివిధ నిర్మాణాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏడీసీఎల్‌కి 67,88,355 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమని ఇది వరకే ప్రభుత్వానికి తెలియజేసింది. అలానే ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద మౌలిక సదుపాయాల కల్పన కసం 1,18,69,500 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం. హౌసింగ్, భవనాలకు 11,77,815 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమైంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఇసుక రీచ్‌లలో నుంచి ఇంత భారీ మోతాదులో ఇసుక సరఫరా చేయాలంటే కుదిరే పని కాదు. ఇదే విషయాన్ని జిల్లా స్థాయి ఇసుక కమిటీ ప్రభుత్వానికి నివేదించింది.

> **పూడికతీత.. బ్యారేజ్‌లో నీటి నిల్వ**
>
> రెండు జిల్లాల్లో ఉన్న ఇసుక రీచ్‌లలో సీ ఆర్‌డీఏ, ఏడీసీఎల్‌కు అవసరమైనంత మోతా దులో ఇసుక నిల్వలు లేవు. ప్రకాశం బ్యా రేజ్ ఎగువున పూడిక తొలగిస్తే చాలా వరకు అవసరాలు తీరతాయి. ప్రకాశం బ్యారేజ్‌లో ఎన్నో సంవత్సరాలుగా ఇసుక పూడిక తొలగిం పు చేపట్ట లేదు. ఈ కారణంగా వరదలు వచ్చిన ప్రతి సారి భారీ మోతాదులో ఇసుక వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజ్‌లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపో తోంది. మరోవైపు ద్వీపాలు కూడా విస్తరి స్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవి ష్యత్తులో మరిన్ని సమస్యలు ఉత్పన్న మయ్యే అవకాశం ఉంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొన్న ప్రభుత్వం రాజధాని అవసరాలకు ఇసుక మేటలు, పూడిక తొలగించనుండటంతో నీటి నిల్వ కూడా పెరుగుతుంది.



2018లో కోనంకిలో కరకట్ట ఉన్నట్టు గూగుల్ చిత్రం (సర్కిల్‌లో)

కోనంకి మట్టిపై కాసు కట్టుకథలు

- తొవ్వింది వాళ్లే.. టీడీపీపై అభియోగం ● అసలు సంగతి చెప్పిన గూగుల్ ఫొటోలు

పిడుగురాళ్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోనంకి గ్రామంలో టీడీపీ నాయకులు మట్టిని అక్రమంగా తరలించేశారని.. వరద ముంపు వస్తే గ్రామం మునకేస్తుందని టీడీపీ నేతల అవినీతికి పాల్పడ్డారని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై స్పందించిన టీడీపీ నేతలు, రెవెన్యూ అధికారులు గూగుల్ టేకోవర్ ద్వారా 2018 నుంచి ఇప్పటి వరకు ఉన్న స్థితిని బయటకు తీశారు. 2018లో మట్టికట్ట ఉన్నట్టు గూగుల్ చిత్రంలో చూపిస్తుండగా 2022లో మట్టికట్ట లేనట్టుగా గూగుల్ చిత్రంలో కనిపిస్తోంది. వైసీపీ హయాంలో గ్రామ నాయకు లు మట్టికట్టను అక్రమంగా తొవ్వేసి రహదారి ని ర్మాణానికి లక్షల రూపా యలకు అమ్మేసి... టీడీపీ నేతలపై చేస్తున్న ఆరోపణ లు సరైనవి కావని గూగుల్ చిత్రం ద్వారా స్పష్టంగా తెలుస్తోంది.



2022లో గ్రామంలో కరకట్ట లేనట్టుగా చూపుతున్న గూగుల్ చిత్రం

కత్తితో వ్యక్తిపై దాడి

మేదరమెట్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): కత్తితో ఒక వ్యక్తి మరొక వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నం చేసిన ఘటన సోమవారం కొరిశపాడు మండలం లోని రాచపూడి గ్రామంలో చోటుచేసుకొంది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు రాచపూడి గ్రామానికి చెందిన మేడ మధుసుధనరావు ఆదివారం మద్యంమత్తులో ఇంటి సమీపంలో అసభ్యకరంగా మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ముప్పనేని పూర్ణచంద్రరావు మధుసుధనరావును వారించబోగా గొడవ జరిగింది. దీంతో ఈ విషయాన్ని మధుసుధనరావు చెన్నైలో ఉంటున్న తన కుమారుడు కార్తీక్‌కు చెప్పాడు. కార్తీక్ చెన్నై నుంచి వస్తూనే కత్తి కొనుగోలు చేసి గ్రామానికి వచ్చాడు. సోమవారం ఉదయం సెంటర్‌లో ఉన్న పూర్ణచంద్రరావుతో తండ్రి కొడుకులు గొడవ పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే కార్తీక్ తన వద్ద ఉన్న కత్తితో పూర్ణచంద్రరావు మెడపై మూడుసార్లు నరికాడు. దీంతో దాడిలో గాయపడిన పూర్ణచంద్రరావును ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్‌ఐ సురేష్‌లు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ విచారించి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శోభాయమానంగా జగన్నాథ రథయాత్ర

బల్లికురవ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబడిపూడి గ్రామంలో సోమవారం రాత్రి జగన్నాథ స్వామి శోబాయ యాత్ర అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ నర్సారావుపేట వారి ఆద్వర్యంలో ఈ యాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. జగన్నాథ స్వామి వారి విగ్రహాలను, రథాన్ని గ్రామంలోని రామాలయం వద్ద ఉంచారు. అక్కడ నుండి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు చేతులతో రథాన్ని లాగారు. ఈసందర్భంగా ప్రతి ఇంటి నుంచి మహిళలు రథానికి నీటితో వారులు పోసి హరతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిరం ఉపాద్యాక్షులు వైష్ణవ కృపదాస్ జగన్నాధుని లీలల గురించి ప్రవచనం చేశారు. అనంతరం గ్రామస్థుల సమష్టి కృషితో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రహదారిని విస్తరించాల్సిందే

అద్దంకి,జూలై14(ఆంధ్రజ్యోతి): పొలాలకు రాకపోకలు సాగించేందుకు 20 అడుగుల వెడల్పు తో బాక్స్ స్ట్రక్చర్ నిర్మాణం చేయాలని రైతులు కోరారు. విజయవాడ -బెంగళూరు రోడ్డు లో అద్దంకి మండలం పాతకొటికలపూడి వద్ద 12 అడుగుల వెడల్పుతో బాక్స్ స్ట్రక్చర్ నిర్మాణం చేస్తున్న నేపథ్యంలో రైతులు పనులు అడ్డుకున్నారు. సోమవారం సాయంత్రం మరోమారు పనులు అడ్డుకోవడంతో రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులు వచ్చి రైతులతో చర్చించారు. బాక్స్ స్ట్రక్చర్ వెడల్పు పెంచటం తమ పరిధిలో లేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి వారంరోజులలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సుమారు 200 ఎకరాల పొలాల నుండి పంట వరిగడ్డి, సుబాబుల్ లోడ్ లతో ట్రాక్టర్ లు రావాలంటే కనీసం 20 అడుగుల వెడల్పు ఉండాల్సిందేనని రైతులు వివరించారు.

32 సొసైటీలకు కొత్త పాలక వర్గాలు



పీడీసీసీబీ ప్రధాన కార్యాలయం

ఒంగోలు విద్య, జూలై14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 32 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు(సొసైటీల) కొత్త పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పి .రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఉన్న అఫీషియల్ పీఐసీ స్థానంలో కొత్తగా నాన్ అఫీషియల్ పీఐసీలను నియమించారు. వాటి వివరాలు పక్క బాక్స్‌లో పొందుపరిచాం...

చీమకుర్తి సొసైటీకి అధ్యక్షుడుగా పూనాటి వెంకటరావు, సభ్యులుగా ఎ.బాలబ్రహ్మారెడ్డి, యానం వెంకటేశ్వర్లు
గుడిపూడివారిపాలెం సొసైటీ అధ్యక్షుడుగా కడియాల వెంకట్రావు, సభ్యులుగా ఉచ్చు రామారావు, వలేటి శ్రీరాములు
నందిపాడు సొసైటీ అధ్యక్షుడుగా యూ నాగేశ్వరరావు, సభ్యులుగా బోడపాటి సుబ్బారావు, తుమ్మల వీరాంజనేయులు,
పెద్దకొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడుగా మండవ హరిప్రసాదు, సభ్యులుగా నల్లూరి సంజీవరావు, సన్నపురెడ్డి రమేష్‌రెడ్డి,
అమ్మనబ్రోలు సొసైటీ అధ్యక్షుడుగా మారెళ్ల జనార్దనరావు, సభ్యులుగా డి.వెంకటశేషయ్య, కె.వెంకటేశ్వర్లు
తిమ్మసముద్రం సొసైటీ అధ్యక్షుడుగా మన్నం శివనాగేశ్వరరావు, సభ్యులుగా డి .కోటేశ్వరరావు, ఎం మురళి
ఓబ్బపాలెం సొసైటీ అధ్యక్షుడుగా మండవ ఆంజనేయులు, సభ్యులుగా ఈదర రాజా, భీమవరపు వెంకటేశ్వర్లు,
ఉప్పగుండూరు సొసైటీ అధ్యక్షుడుగా కాట్రగడ్డ చంద్రబాబు, సభ్యులుగా ఎన్.భాస్కరరావు, పి.శ్రీనివాసరావు
బి.నిడమానూరు సొసైటీ అధ్యక్షుడుగా నలమలపు అంకిరెడ్డి, సభ్యులుగా ఎల్ శిరోమణి, ఎన్ వెంకటరావు
చదలవాడ సొసైటీ అధ్యక్షుడుగా కె.నాగరాజు, సభ్యులుగా జె. హరిబాబు, ఎస్ యల్లమంద
గుమ్మనంపాడు సొసైటీ అధ్యక్షుడుగా బి.రంగనాయకులు, సభ్యులుగా పి.రమణారావు, పి నరసింహారావు
గురువారెడ్డిపాలెం సొసైటీ అధ్యక్షుడుగా కె.సుబ్బారెడ్డి, సభ్యులుగా కె.శ్రీకాంత్, పి.ఆనందరావు
మంగమూరు సొసైటీ అధ్యక్షుడుగా ఎన్.నారాయణరావు, సభ్యులుగా ఎస్‌కే మస్తాన్ సాహెబ్, కె.గోపీకృష్ణ
పేర్నమిట్ట సొసైటీ అధ్యక్షుడుగా కె. వెంకటేశ్వరరావు,సభ్యులుగా పి.శ్రీనివాసరావు,ఎ.బ్రహ్మయ్య
సంతనూతలపాడు సిండికేట్ ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షుడుగా కె.విజయమ్మ, సభ్యులుగా ఎం రామకృష్ణారెడ్డి, పి.రాము
చౌడవరం సొసైటీ అధ్యక్షుడుగా పి.లక్ష్మీప్రసన్న, సభ్యులుగా ఆర్ నారాయణ, కె.వెంకటేశ్వర్లు
సిఎస్‌పురం సొసైటీ అధ్యక్షుడుగా వెంకటరెడ్డి, సభ్యులుగా టి.నారాయణ, డి .నాగరాజు
పామూరు సొసైటీ అధ్యక్షుడుగా యు.హరిబాబు, సభ్యులుగా ఎస్‌కె రహంతుల్లా, కె.వెంకటరమణయ్య
పీసీపల్లి సొసైటీ అధ్యక్షుడుగా పి.ఈశ్వరయ్య, సభ్యులుగా డీ సుబ్రహ్మణ్యం, యు. పిచ్చిరెడ్డి,
వెలిగండ్ల సొసైటీ అధ్యక్షుడుగా ఎస్ కాశిరెడ్డి, సభ్యులుగా వై సలోమన్, లక్ష్మీనారాయణ
ఈస్ట్ వెంకటాపురం సొసైటీ అధ్యక్షుడుగా డి. కృష్ణ, సభ్యులుగా వై.వెంకారెడ్డి, ఆర్ .వెంకటేశ్వర్లు
దర్శి సొసైటీ అధ్యక్షుడుగా కె .చంద్రశేఖరబాబు, సభ్యులుగా పి. పాపారావు, ఎ. వెంకటరావు
పసుపుగల్లు సొసైటీ అధ్యక్షుడుగా పి.శ్రీనివాసరెడ్డి, సభ్యులుగా వె.వెంకటేశ్వరరెడ్డి, ఎస్.నాగేశ్వరరావు
చెట్లమిట్ట సొసైటీ అధ్యక్షుడుగా వి.బోడిరెడ్డి, సభ్యులుగా జి. సత్యనారాయణరెడ్డి, యు.చినశేషయ్య
గుర్రపుసాల సొసైటీ అధ్యక్షుడుగా వి.వెంకటేశ్వర్లు, సభ్యులుగా జి. గోవిందయ్య,జి.చినసుబ్బయ్య
వీరభద్రాపురం సొసైటీ అధ్యక్షుడుగా జి.కోటయ్య,సభ్యులుగా ఎ. మల్లయ్య, జి.ఆంజనేయులు
ముటుకుల సొసైటీ అధ్యక్షుడుగా పి.యోగేశ్వరరావు, సభ్యులుగా జి.వెంకటేశ్వర్లు, కె.అచ్చియ్య
మిట్టపాలెం సొసైటీ అధ్యక్షుడుగా ఎం.అల్లూరురెడ్డి, సభ్యులుగా వై.వెంకటనారాయణ, సభ్యులు డి. వెంకటనారాయణ,
విశ్వనాథపురం సొసైటీ అధ్యక్షుడుగా కె. శ్రీనివాసరెడ్డి,సభ్యులుగా డి.చినికాశిం, కె.ఏడుకొండలు
గిద్దలూరు సొసైటీ అధ్యక్షుడుగా డి.బాలఈశ్వరయ్య, సభ్యులుగా డి.గోపాల్‌రెడ్డి, సీహెచ్ ఆనందరావు
ఇడమకల్లు సొసైటీ అధ్యక్షుడుగా బి.రవీంద్రారెడ్డి, సభ్యులుగా డి.నాగేశ్వరరెడ్డి, బి రంగయ్య
అర్ధవీడు సొసైటీ అధ్యక్షుడుగా కె.వెంకటరంగారెడ్డి, సభ్యులుగా ఎల్. రామయ్య, జి. రామకృష్ణలను నియమించారు

వంతెనల వద్ద వామ్మో..!



శిథిలావస్థకు చేరుకున్న పర్చూరు వాగుపై బ్రిడ్జి



కుంకలమర్రు రోడ్డులోని కొమ్మమూరు కాలువపై రక్షణ గోడలు లేని బ్రిడ్జి

పర్చూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలోని వంతెనల సైడు గోడలు శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయంగా మారాయి. కొన్నిచోట్ల వంతెన గోడలమధ్యలో చెట్లు పెరిగిపోతున్నా పట్టించుకునే వారే లేకపోవడంతో వంతెనలు దెబ్బతింటున్నాయి. దీంతో ఆయా ప్రధాన రహదారుల్లోని వంతెనల పరిస్థితి దయనీయంగా మారింది. పర్చూరు వాగుపై ఉన్న వంతెన కనీస మరమ్మతులకు నోచుకోలేదు. వంతెన గోడపై చెట్టుపెరిగినా అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. ఇక చీరాల రోడ్డులోని కొమ్మమూరు కాలువ వంతనపై సైడ్‌వాల్ దెబ్బతింది. ద్విచక్రవాహనదారులు ఎవరైనా ఇక్కడ నియంత్రణ కోల్పోతే నేరుగా కాలువలో పడే ప్రమాదం ఉంది. ఇక స్వర్ణ-కారంచేడు రోడ్డులోని వంతెన కూడా ప్రమాదభరితంగా ఉంది. కారంచేడు-కుంకలమర్రు రోడ్డులోని కొమ్మమూరు కాలువపై ఏర్పాటు చేసిన వంతెన మరింత ప్రమాదభరితంగా తయారైంది. మరోవైపు శిథిలావస్థకు చేరిన వంతెనతో పాటు, సైడ్ వాల్స్ పూర్తిగా దెబ్బతినటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనదారులు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు కొమ్మమూరు కాలువలో నిత్యం నీరు ప్రవహిస్తూ ఉండటంతో పరిస్థితి ఒకింత ఆందోళనకరంగా మారింది.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న బ్రిడ్జిలకు కనీస మరమ్మతులు చేయించడంతోపాటు వంతెన గోడలపై అలముకున్న వృక్షాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసులు త్వరగా పరిష్కారం

అద్దంకి, జూలై14(ఆంధ్రజ్యోతి): ఇరు పక్షాల అంగీకారం తో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని అద్దంకి సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు భవనాల సముదాయం నుండి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ బొమ్మ సెంటర్, పాతబస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, బంగ్లా రోడ్డు మీదుగా సాగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం అయిన కేసులలో ఇరు పక్షాలు విజయం సాధించినట్లే అవుతుందన్నారు. ఇరు పక్షాలు తమ డిమాండ్‌లను తెలుపుకునే అవకాశం ఉంటుందన్నారు. కేసుల పరిష్కారం లో ఎలాంటి కాలయాపన లేకుండా సమయం ఆదా అవుతుందన్నారు. పెండింగ్ కేసులు త్వరిత గతిన పరిష్కారం అయ్యేందుకు దోహద పడుతుందన్నారు.మధ్యవర్తిత్వం కేసులు పరిష్కారం కోసం న్యాయవాదులు ఉదయభాస్కర్, రామకృష్ణారావు, మారతశ్రీను, మహ్మద్ రఫీలు అందుబాటు లో ఉంటారన్నారు. కొన్ని సందర్భాలలో సుమోటో గా తమ దృష్టి కి వచ్చిన కేసులను కూడా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించటం జరుగుతుందన్నారు. ఈ కార్య క్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారులు, న్యాయవాదులు

టీడీపీ ప్రభుత్వంలోనే రహదారుల అభివృద్ధి

మంత్రి రవికుమార్



ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్న మంత్రి

బల్లికురవ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అయిదేళ్ల అధికారంలో ఉన్న కూడా వైసీపీ గ్రామాలలో రోడ్లను అభివృద్ధి పరచలేదని కూటమి ప్రభుత్వం రాగానే రోడ్లను అభివృద్ధి చేస్తోందని చేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో రూ.10 లక్షలతో అభివృద్ధి పరిచిన సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. అలానే చెన్నుపల్లి వైదన గ్రామాల మధ్య రూ. 3 కోట్లతో అభివృద్ధి పరిచిన బీటీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. అనంతరం ముక్తేశ్వరం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి రవికుమార్ ఇంటింటికి తిరిగి గత ఏడాది కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులతో రాష్ట్రం 20 ఏళ్లు అభివృద్ధిలో వెనక్కు వెళ్లిందన్నారు. ఎంతలో అనుభవం కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండడంతో ఈ రోజు పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఎన్నికల హామీల అమలులో భాగంగా ఇప్పటికే అన్న క్యాంటీన్‌లు, పింఛన్ నగదు పెంపు, తల్లికి వందనం, ప్రతి ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ యువతకు డీఎస్సీ, గ్రామాలలో అధ్వాన స్థితిలో ఉన్న రోడ్ల అభివృద్ధి వంటి పనులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. మంచి ప్రభుత్వంకు ప్రజల మద్దతు ఇవ్వాలన్నారు. గ్రామాలలో ప్రజలకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని అలానే సోలార్ యూనిట్లకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అట్లూరి నాగేశ్వరరావు, మారాబత్తిన అంజనేయులు, ఇజ్రాయల్ కమతం మంగారావు, చెన్నూరిప్రసాద్, అడపాల బసవయ్య , నాగరాజు, యాలగాల చిరంజీవి, గొట్టిపాటి లక్ష్మయ్య, శంకర్, సింగరయ్య, పోగుల శేఖర్, చంద్రమౌళి, గొట్టిపాటి మారుతి తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో కుసుమకుమారి, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ గుర్తిస్తే చర్యలు

- ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు
- మైనింగ్ ఏడీ రామచంద్రయ్య

అద్దంకి,జూలై14(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, మైనింగ్ జాయింట్ సర్వే నిర్వహించి అనుమతులకు మించి గ్రావెల్, మెటల్ తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోనున్నట్లు చీరాల ఆర్‌డీవో చం ద్రశేఖర నాయుడు, బాపట్ల జిల్లా మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ రామచంద్రయ్య అన్నారు. అద్దంకి మండలం ధర్మవరం సమీపంలోని కొండల నుండి గ్రావెల్, మెటల్ అనుమతులకు మించి తరలిస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి'లో ఇటీ వల వరుస కథనాలు ప్రచురితం కావడంతో సోమవారం చీరాల ఆర్‌డీవో చంద్రశేఖర నాయుడు, బాపట్ల జిల్లా మైనింగ్ ఏడి రామచంద్రయ్యలు పరిశీలించారు. గ్రావెల్ తరలించిన ధర్మవరం చెరువు, సమీపంలో లోతుగా తవ్వకాలు చేసిన కొండ ప్రాంతం తో పాటు మెటల్ కోసం తవ్విన కొండలను పరిశీలిం చారు. ఎంత మేర అనుమతులు ఉన్నాయి.. ఇప్పటి వరకు ఎంత మేర తవ్వకాలు జరిగాయి అన్న విషయమై ఉమ్మడి సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. అనుమతులకు మించి తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ శ్రీచరణ్, ఆర్‌ఐ శంకర్, మండల సర్వేయర్ శ్రీలక్ష్మి, రెవెన్యూ, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



క్వారీని పరిశీలిస్తున్న ఆర్‌డీవో

వచ్చే ఎన్నికల్లో వైసీపీకి సున్నా సీట్లు

చీమకుర్తిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి స్వామి

చీమకుర్తి,జూలై14(ఆంధ్రజ్యోతి): వికృత చేష్టలతో పరుష పదజాలంతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం జరిగేలా పన్నాంగం పన్నుతున్న ప్రతిపక్ష వైసీపీకి రాబోయే ఎన్నికల్లో గుండు సున్నా సీట్లు కట్టబెట్టి ప్రజలే బుద్ధి చెబుతారని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం సాయంత్రం చీమకుర్తి పట్టణంలో రామనగర్‌లో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఇంటింటా తిరుగుతూ ఏడాదిపాలనలో జరిగిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను అందిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సభలో మంత్రి స్వామి మాట్లాడారు.తల్లికి వందనం ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఇచ్చామని అన్నపుడు మహిళలనుంచి పెద్ద ఎత్తున చప్పట్ల ద్వారా హర్షం వ్యక్తం అయింది. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏడాది కాలంలో చీమకుర్తిలో చేసిన అభివృద్ధిని వివరించారు రామతీర్ధంనుంచి నేరుగా చీమకుర్తి పట్టణవాసులకు తాగునీరు అందించే ప్రాజెక్ట్‌ను తన హయాంలో తీసుకువస్తే గత వైసీపీ ప్రభుత్వం మూలన పడవేసిందన్నారు. ఇపుడు తిరిగి రూ.73కోట్లతో పనులును ప్రారంభించనున్నామన్నారు. తదుపరి మంత్రి,ఎమ్మెల్యేలకు పౌర సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, ముప్పూరి చలమయ్య, కందిమళ్ల గంగాధరరావు, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, గొల్లపూడి సుబ్బారావు, కోటేశ్వరరావు, కౌన్సిలర్ రమాదేవి, అవనిగడ్డ శేషారావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



రామనగర్‌లో ఇంటింటా తిరుగుతున్న మంత్రి స్వామి,ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అవీఇవీ

ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయాలి



గ్రామ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సుభాషిణి

కొత్తపట్నం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించే ప్రతి పంటను ప్రకృతి వ్యవసాయ విధానంలోనే సాగు చేసే విధంగా చూడాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ సుభాషిణి అన్నారు. సోమవారం రాత్రి కొత్తపట్నంలోని ఎస్సీ కాలనీలో జరిగిన వ్యవసాయ వార్షిక ప్రణాళిక తయారీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కొత్తపట్నం గ్రామంలో ఆరు గ్రామ సంఘాలను ఏర్పాటు చేసి ఈ సంవత్సరం వేయబోయే పంటలు ప్రతి రైతు కూడా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను తినటం వలన ఆరోగ్యంతోపాటు పర్యావరణాన్ని కూడా కాపాడుకోవచ్చని ఆమె అన్నారు. సాగు భూమి లేని వారు ఇంటి వద్దనే కిచెన్ గార్డెన్‌ను పెంచుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశానికి మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఏసమ్మ, వీవో ఏ ప్రత్యూష, మహిళా సంఘాలసభ్యులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రెడ్డప్ప, ఇందిర, ప్రవీణ్, సురేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఎర్రగొండపాలెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం వేగినాటి కోటయ్యనగర్ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారం రోజులుగా ట్యాంకర్ల దారా నీటిని సరఫరా చేయడం లేదని, తాగునీరు లేక 100 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డీటీ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

గ్రానైట్ క్వారీల్లో ప్రమాదరహిత చర్యలు : ఐజీ



గ్రానైట్ క్వారీలను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి

చీమకుర్తి,జూలై14(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు.చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీలో భాగంగా సోమవారం ఆయన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో కలిసి రికార్డులు తనిఖీలు చేశారు. అనంతరం గ్రానైట్ క్వారీలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో నేరాల కట్టడికి సీసీ కెమెరాలతో అనునిత్యం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు,సీఐ సుబ్బారావు,సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జుల నియామకం

అద్దంకి,జూలై14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జులను నియమిస్తూ ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. ధర్మవరం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా చాగంటి రాజేంద్రప్రసాద్, సభ్యులుగా చింతా వెంకటరెడ్డి, లచ్చిబోయిన వాసు, మోదేపల్లి సొసైటీ చైర్మన్‌గా నర్రా వీరయ్య సభ్యులుగా జాగర్లమూడి శ్రీనివాసరావు, అనపర్తి పున్నారావు, నాగులపాడు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా యేనుగంటి వెంకటరామయ్య(బాబు), సోమేపల్లి వెంకటరావు, వేములపాటి సుబ్బరావమ్మ, బల్లికురవ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా గొట్టిపాటి లక్ష్మయ్య, సభ్యులుగా అడవి అంజయ్య, చంటి వెంకటరెడ్డి, కొత్తూరు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా మామిళ్ళపల్లి ప్రవీణ్, గుంటూరు నారాయణ, దొడ్డా చంద్రమౌళి, కూకట్లపల్లి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా పాలడుగు సుబ్బారావు, సభ్యులుగా అంజయ్య, గోగులమూడి వెంకటరావు, వైదన సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా గాలం రామకృష్ణ, సభ్యులు గా యేల్చూరి అంజయ్య, కుందుర్తి సిద్ధయ్య, కొండమంజులూరు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా బత్తుల వెంకట్రావు, సభ్యులుగా చింతలచెరువు రూబేను, బత్తుల వెంకటరావు(హనుమంతరావు), కోటపాడు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా రావుల శింగరకొండ, సభ్యులుగా కట్టా సుబ్బారావు, మక్కెన ఆంజనేయులు, చందలూరు సొసైటీ పర్సన్‌ఇన్‌చార్జ్‌గా బెల్లంకొండ శ్రీధర్‌బాబు, వట్టెం శేషయ్య, మాగులూరి సుబ్బారావు, ధైవాలరావూరు పర్సన్ ఇన్‌చార్జ్‌గా మద్దినేని రాఘవస్వామి, సభ్యులుగా తొట్టెంపూడి హరిబాబు, బాలినేని వీరయ్య, పమిడిపాడు పర్సన్ ఇన్‌చార్జ్‌గా జాగర్లమూడి జయకృష్ణ, సభ్యులుగా మాలెంపాటి లక్ష్మీనారాయణ, తల్లపనేని శ్రీనివాసరావు, సోమవరప్పాడు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఎం వెంకటసుబ్బారెడ్డి, సభ్యులుగా యేనుగుల రామాంజనేయులు, మైలా కాశయ్యలను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

నాలుగు సొసైటీలకు పాలకవర్గం ఎంపిక

బల్లికురవ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాలుగు సొసైటీలకు పాలకవర్గాన్ని నియమిస్తూ, సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బల్లికురవ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా గొట్టిపాటి లక్ష్మయ్య, సభ్యులుగా చంటి వెంకటరెడ్డి, అడవి అంజయ్య, కొత్తూరు సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జ్‌గా మామిళ్లపల్లి ప్రవీణ్‌కుమార్, సభ్యులుగా గుంటూరు నారాయణ, దొడ్డా చంద్రమౌళి, కూకట్లపల్లి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా పాలడుగు సుబ్బారావు, సభ్యులుగా ఇలసాగరపు అంజయ్య, గోగులమూడి వెంకటరెడ్డి, వైదన సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా గాలం రామకృష్ణ, సభ్యులుగా ఏల్చూరి అంజయ్య, కుందుర్తి సిద్ధయ్యలను ప్రభుత్వం ఎంపిక చేసింది. వీరు త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

పొగాకు కొనుగోలులో జాప్యం

● రోజువారీ కొనుగోళ్లలో పెరగని వేగం ● కదలని మండెలతో రైతులలో ఆందోళన ● సోమవారం 250 బేళ్లకే పరిమితం

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లలో వేగం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసవికి ముందు ఎడ్ల కొష్టాల వద్ద వేసే వరిగడ్డి వాముల మాదిరిగా పొగాకు నిల్వలు ఉండగా, పాలదూడలకు విసిరే గడ్డిపోచల మాదిరిగా కొనుగోలు ఉన్నాయి. దీంతో తమ వంతు ప్రకారం పొగాకు ఎప్పుడు అమ్ముకోవాలో అర్థంకాక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంగులూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలో గురు, శుక్రవారాలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాకతో 500 బేళ్లను అధికారులు కొనుగోలు చేశారు. అయితే సోమవారం నాడు కేవలం 250 బేళ్లను మాత్రమే కొనుగోలు చేయడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. రైతులు కొనుగోలు కేంద్రాలకు కనీసం 500 బేళ్లు తెచ్చేలా నిర్ణయిత సమాచారం కూడా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరగని పొగాకు నిల్వలు

ఈ ఏడాది మండలంలో నల్లబర్లీ సాగు ఇబ్బడి ముబ్బడిగా పెరగ్గా, రైతుల వద్ద కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ముందే అధికారిక లెక్కల ప్రకారం మండలంలో 47 వేల క్వింటాళ్ల పొగాకు నిల్వలున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో 13 రోజులు క్రితం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు 2100 బేళ్ల పొగాకు మాత్రమే కొనుగోలు చేశారు. మండలంలో అత్యధికంగా చందలూరులో 14,737 క్వింటాళ్లు, పంగులూరులో 10,573 క్వింటాళ్లు, నూజెండ్లపల్లిలో 6,156 క్వింటాళ్లు, బూదవాడలో 6,260 క్వింటాళ్ల నిల్వలుండగా, మిగిలిన గ్రామాల్లో వేల క్వింటాళ్ల పొగాకు నిల్వలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, రైతు వద్ద చివరి ఆకును కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే రైతుల వద్ద పొగాకు నిల్వలు రోజులు గడిచే కొద్ది రంగు మారుతుండగా, కొనుగోళ్లలో మందగమనం రైతులను కుంగదీస్తోంది. పొగాకు రైతులను ఆదుకొనేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.270 కోట్లు కేటాయించి కొనుగోలు ప్రారంభించినా, ఇక్కడ కొనుగోళ్లలో ఆస్థాయి వేగం లేకుండా పోయింది. పంట సాగు చేయమని చెప్పిన ప్రైవేట్ కంపెనీలు మొఖం చాటేసిన సందర్భంలో ప్రభుత్వం కొనుగోలుకు ముందుకు వచ్చింది. దీంతో రైతులు తమను మోసగించిన సంస్థలను కూడా నిందించకుండా ప్రభుత్వం వైపు చూస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా ప్రజాదనంతో కొనుగోలు ప్రారంచినప్పటికీ, రైతులును మోసం చేసిన కంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. భవిష్యత్తులో ఇలాంటి మోసాలు జరగకుండా ఏం చేస్తుందో ప్రకటించలేదు. ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికైనా ప్రభుత్వం బర్లీపొగాకు రైతుల పొగాకు కొనుగోలులో మరింత పారదర్శకంగా వ్యవహరించాలని, ఇచ్చిన మాట ప్రకారం పొగాకు కొనుగోలు చేసే విధంగా వేగం పెంచాలని రైతాంగం కోరుతోంది.



యార్డులో కొనుగోలు చేస్తున్న పొగాకు

అవీ..ఇవీ..

ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు

● సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే



మొక్కతో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న వార్డు ప్రజలు

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలుజేస్తోందని ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు, వేటపాలెం మండలం రామన్నపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రోడ్ల అధ్వానస్థితిపై ప్రజలు గగ్గోలు పెట్టినా, పట్టించుకొనే వారే కాదన్నారు. ప్రస్తుతం రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అలాగే కొత్తపేటలో హిందూ శ్మశాన వాటిక ఆధునికీకరణ పనులను పరిశీలించారు. రామచంద్రపురంలో పోలేరమ్మ వారి ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూలులోని పరిశుభ్రత పిల్లలను ఆకట్టుకోవాలి



దాత అందజేసిన భోజనం ప్లేటుతో విద్యార్థులు

మార్టూరు,జూలై14(ఆంధ్రజ్యోతి): పిల్లలు బడికి రావాలంటే మొదట స్కూలులోని పరిశుభ్రత, వాతావరణం పిల్లలను ఆకట్టుకోవాలని, తద్వారా వారికి రోజూ బడికి రావాలనే ఆసక్తి పెరుగుతుందని సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ అన్నారు. సోమవారం మండలంలోని జొన్నతాళి గ్రామంలోని యూపీ పాఠశాలలో గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకులు శానంపూడి చైతన్య సొంత నిధులతో వంద మంది బాలబాలికలకు భోజనప్లేట్లను అందచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి విచ్చేసిన సర్పంచ్ నాగేంద్రమ్మ ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. రోజూ స్కూలులోని పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలనే ఆలోచనను విద్యార్థులలో రేకెత్తించాలన్నారు. అనంతరం ప్లేట్లు అందజేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుని హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

మార్టూరు, జూలై14,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్దన్ కాలనీకి చెందిన పింద్రాళ్ల పోలయ్య అనే యువకుడ్ని హత్యచేసిన కేసులో సోమవారం ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. ఆయన కథనం మేరకు, జనార్థన్ కాలనీలో ఉంటున్న పోలయ్య పాత ఇనుపసామానుకు ఉల్లిపాయలు ఇచ్చే వ్యాపారం చేస్తుంటారు. అదేవిధంగా పోలయ్య బాబాయి పింద్రాల శ్రీను గాడిదలను, పందులను అమ్ముతుంటారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10న సాయంత్రం పోలయ్యకు బాబాయి శ్రీనుతో గొడవ జరిగింది. దాంతో పోలయ్య ఆవేశంలో ఇంటిలో నుంచి కొడవలితో బయటకు వచ్చి బాబాయి శ్రీనును గాయపరచాడు. ఈ ఘటనతో తీవ్ర ఆవేశానికి గురైన శ్రీను, తన అల్లుడు చిన్నా, తన చెల్లెలు పద్మలతో కలిసి నాపరాళ్లతో పోలయ్యను తీవ్రంగా గాయపరచారు. దీంతో గుంటూరు ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 12వ తేదీ పోలయ్య చనిపోయారు. ఈ విషయమై పోలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం అరెస్ట్ చేసిన ముగ్గురిని అద్దంకి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టపరంగా చర్యలు

విద్యుత్ ఎస్ఈ హెచ్చరిక

పంగులూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని బాపట్ల సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ జి.అంజనేయులు హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాలలో సోమవారం విద్యుత్‌శాఖకు సంబంధించిన విజిలెన్స్ విభాగంతో పాటు ఆపరేషన్స్ విభాగం అధికారులు, సిబ్బంది సోమవారం విద్యుత్ చౌర్యంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పర్యవేక్షక ఇంజనీర్లు అంజనేయులు, విజయకృష్ణ ఆధ్వర్యంలో విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.భాస్కరరావు, ఆపరేషన్స్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.మస్తానరావుల నేతృత్వంలో అధికారులు, సిబ్బంది 29 బృందాలుగా ఏర్పడి పలు చోట్ల 1527 సర్వీసులు పరిశీలించారు. ఈ తనిఖీలలో భాగంగా అనుమతికి మించిన లోడు వినియోగిస్తున్న విద్యుత్ 59 మంది వినియోగదారులకు రూ.1,53,200 అపరాధం విధించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.15000 చొప్పున, అనుమతించిన కేటగిరి కాకుండా వేరే కేటగిరిలో విద్యుత్ వినియోగించుకుంటున్న ముగ్గురికి రూ.18 వేల అపరాధ రుసుము విధించారు. ఈ తనిఖీలలో అద్దంకి, మార్టూరు డిప్యూటీ ఈఈలు ఎం.ఆమోదరం, సురేంద్రబాబు, విజలెన్స్ డీఈఈ విజయ్‌శ్రీనివాస్‌లు, ఎ అద్దంకి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఏఈలు వారి సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఈ అంజనేయులు

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

విజయలక్ష్మీ ట్రస్ట్ చైర్మన్ వేగిరాజు శివశర్మ

పర్చూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వంతో పాటు, ప్రజల భాగస్వామ్యం ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని విజయలక్ష్మీ ట్రస్ట్ చైర్మన్ వేగిరాజు శివశర్మ అన్నారు. సోమవారం పర్చూరు రోటరీక్లబ్ అధ్వర్యంలో స్థానిక రోటరీ భవనంలో సమగ్ర గ్రామీణ అభివృద్ధి అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పర్చూరు రోటరీ అధ్వర్యంలో చేస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలను ఆయన కొనియాడారు. కార్యక్రమం లో క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణ మోహన్, ఆర్‌సీసీ చైర్మన్ పోట్రు రాఘవయ్య, కోమటి ఆంజనేయులు, నాగభైరు శ్రీనివాసరావు, పాబోలు ఉదయభాస్కర్, కొల్లా నరేంద్రకుమార్, కొల్లా సుబ్బారావు, నాగుబడి సుబ్బారావు, పోలిశెట్టి చంద్రశేఖర్, తేళ్ల రమేష్ చంద్ర, దండా శ్రీనివాసరావు, కాల్వ సత్యనా రాయణ, భవనం రాజ గోపాల్‌రెడ్డి, పంబి సదానందరెడ్డి, మున్నంగి వెంకట సుబ్బయ్య, కోడూరి సుబ్రహ్మణ్యాచారి తది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయలక్ష్మీ ట్రస్ట్ ఛైర్మన్ శివశర్మ

చివరి పొగాకు వరకు కొనుగోలు చేస్తాం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు చివరి ఆకు వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. అందులో భాగంగానే మరిన్ని గోడౌన్లను అందుబాటులోని తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. సోమవారం పర్చూరు మండలం అడుసుమల్లిలో ఏర్పాటు చేసిన యద్దనపూడి మండల పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ అధికారులతో కలసి ఏలూరి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ పొగాకు కంపెనీలు రైతులకు ఆశచూపి నిలువునా మోసం చేసినా ప్రభుత్వం మాత్రం రైతులను ఆదుకొంటుం దన్నారు. ఈ ఏడాది తిరిగి పొగాకును సాగుచేస్తే తీవ్రఇబ్బందులు ఉంటా యన్న విషయాన్ని రైతులు గుర్తిం చాలన్నారు. మార్కెట్లో మొక్కజొన్న కు ప్రభుత్వం రూ.2400 మద్దతు ధర ప్రకటించిందని రానున్న రోజుల్లో ఇంకా ధర పెరిగే అవ కాశం ఉందన్నారు. రైతుల ప్రయో జనాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఆర్డీవో గ్లోరియా, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఆయా మండల పార్టీ అధ్యక్షులు నల్లపునేని రంగయ్య చౌదరి, తాటి నాగేశ్వరరావు, షంషుద్దీన్, తొండపు ఆదినారాయణ, కామేపల్లి హరిబాబు, జనార్ధన్, రజాక్ శ్రీనివాసరావు, రావిపాటి సీతయ్య, కే.కృష్ణ పాల్గొన్నారు.

మార్టూరులో: మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోమవారం నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 705 మంది రైతుల వద్ద సుమారు 25 వేల క్వింటాళ్లకు పైగా పొగాకు బేళ్లు ఉన్నాయన్నారు. దీంతో రైతులు ఇబ్బంది పడకూడదని పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే భవిష్యత్తులో పొగాకు పంటను సాగు చేయవద్దని రైతులను కోరారు. మొక్కజొన్న పంట కు పెట్టుబడి తక్కువగా ఉండటం,లాభదాయకంగా ఉండటంతో రైతులు మొక్కజొన్న పంట సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. పొగాకు కంపెనీలు చెప్పే మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. వచ్చే నెల 15 లోపు మండలంలోని రైతుల అందరి వద్ద పొగాకు కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ లవన్న, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఆర్‌డీవో గ్లోరియా, టీడీపీ నాయకులు తాటి నాగేశ్వరరావు, షేక్ రజాక్, కామినేని జనార్దన్,గుంజి వెంకట్రావు, యలగా రామాంజనేయులు, కమ్మ శివనాగేశ్వరరావు, ఉప్పలపాటి చక్రపాణి,కందిమళ్ల రామకోటేశ్వర రావు పాల్గొన్నారు.



పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నేడు పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

మేదరమెట్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండలంలోని తమ్మవరం గ్రామంలో నూతనంగా బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నూతనంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్య అతిగా హాజరుకానున్నారు.

సహకార సంఘాలకు నూతన పాలకవర్గం

మేదరమెట్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నూతన పాలకవర్గాలను ప్రభుత్వం సోమవారం నియమిం చింది. కొరిశపాడు మండలంలోని పమిడిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా జాగర్ల మూడి జయకృష్ణను, సభ్యులుగా ఎం.లక్ష్మీనారాయణ, టి.శ్రీనివాసరావులను నియమించారు. దైవాలరావూరు సొసైటీకి చైర్మన్‌గా మద్దినేని రాఘవ స్వామిని, సభ్యులుగా టి.హరిబాబు, ఎం.వీరయ్యలను నియమించారు. ఎన్నికైన సభ్యులుకు పలువురు నాయకులు అభినందించారు. సొసైటీ అభివృద్ధికి కృషిచేస్తామని ఎన్నికైన సభ్యులు తెలిపారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

మార్టూరు,జూలై14(ఆంధ్రజ్యోతి):కొత్తగా గ్రామాలలో సిమెంటు రోడ్లను నిర్మించడంతో పాటు రోడ్డు పక్కన విద్యుత్‌స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని మండలంలోని కోలలపూడి సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, బొబ్బేపల్లి ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ భుక్యా శాంతిబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ సమస్యలను ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తనుకువచ్చారు. అదేవిధంగా ఏవో లావణ్య మాట్లాడుతూ వర్షాలు కురిసిన తర్వాత రైతులకు కందులు, మినుములు నూరుశాతం రాయితీతో అందజేస్తామన్నారు. మండలంలోని పలుగ్రామాలలో మరమ్మత్తులకు గురైన చేతి పంపులను మొబైల్ ఆటో ద్వారా మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఇంకా మార్టూరు, వలపర్ల, ద్రోణాదుల గ్రామాలలో బోర్లుకు మరమ్మత్తులు చేయవలసిన అవసరం ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య తెలిపారు. గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన సిమెంటు రోడ్లకు బిల్లులు రాలేదని పలువురు సర్పంచులు సమావేశం దృష్టికి తెచ్చారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

ఇంకొల్లు, జూలై 14, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో సోమవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఉపకరణాలను ఎంఈవో శ్రీనివాసరావు అందజేశారు. 2042-25వ విద్యాసంవత్సరంలో జరిగిన క్యాంపు లో ఇంకొల్లు మండలానికి చెందిన వై.దీక్షకు ట్రైసైకిల్, వి.వరుణ్‌కు రోలేటర్, ఎస్‌కె.ఆఫ్రాకు వినికిడి యంత్రాల కోసం ఎంపికయ్యారు. వీరికి సోమవారం ఎంఈవో ఉపకరణాలు అందజేశారు. వీటిని సక్రమంగా వినియోగించుకొని విద్యలో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జరుబుల అనీత, ఐఈఆర్‌టీలు వీరయ్య, ఎం.హరిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ప్రత్యేక వసతులు

వేటపాలెం(చీరాల), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు వేటపాలెం ఎంఈవో జేవీ సుబ్బయ్య పురుషోత్తం అన్నారు. మండల పరిధిలోని భవిత కేంద్రంలో విద్యభ్యాసం పొందుతున్న ముగ్గురు దివ్యాంగులకు రెండు ట్రై సైకిల్స్, ఒక వీల్‌చైర్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులపై బోధకులతోపాటు తల్లిదండ్రులు కూడా భద్రతలు తీసుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో శ్రీధర్, ధనలక్ష్మీ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డంపింగ్ కేంద్రంగా ఎన్‌ఎస్‌పీ కాలువ



ఎన్ఎస్‌పీ కాలువలో నిండిన వ్యర్థాలు

అద్దంకి, జూలై14 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలువ డంపింగ్‌కు కేంద్రంగా మారింది. కాకానిపాలెం సమీపంలోని అద్దంకి మేజర్ కాలువలో భవనాల వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను తెచ్చి పూడ్చి వేస్తున్నారు. ఇప్పటికే నంబూరిపాలెం నుండి రామ్‌నగర్ వరకు కాలువ ఆనవాళ్లు లేకుండా పోగా, ప్రస్తుతం కాకానిపాలెం వద్ద కూడా వ్యర్థాలు పోస్తుండడంతో అదే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఒక వైపు అద్దంకి మేజర్ కాలువలో అభివృద్ధి పనులు, మినీ బైపాస్‌గా మార్చే ప్రతిపాదనలు ఉండగా, వ్యర్థాలతో కాలువను నింపడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను కాలువ లో వేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనాథ యువకునికి సాయం

మార్టూరు, జూలై14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నతాళి గ్రామానికి చెందిన అనాథ యువకుడు జంధ్రాజుపల్లి మరియదాసుకు సోమవారం హెల్పింగ్ హాండ్స్ సంస్థ వారు 5.వేలు నగదు, బస్తా బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో పఠాన్ ఖాదర్ వలి, పుట్టా అయ్యప్పస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

మార్టూరు,జూలై14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేతాజీనగర్ సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు సోమవారం చిమటా వెంకటేశ్వర్లు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. పర్చూరు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ విద్యాలయాల్లో 22 ఏళ్ల నుంచి ఉచితంగా వెంకటేశ్వర్లు నోటుపుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో గుంటుపల్లి చందు, ఉపాధ్యాయులు ఏ.సూర్యప్రకాశరావు, కవిత తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో రోడ్డుపైనే మెడికల్ వ్యర్థాలు



రోడ్డుపై పడవేసిన మెడికల్ వ్యర్థాలు

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలో కొందరు మెడికల్ దుకాణదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా వైద్యుల నుండి ప్రిస్కిప్షన్ వెంట తెచ్చుకున్న వారికే మందులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే అందుకు భిన్నంగా దుకాణాదారులు ఏకంగా ఇంక్షన్‌లు సైతం వారే చేస్తూ వైద్యం చేస్తున్నారు. అంతేకాకుండా రోగులకు వినియోగించిన సూదులు, సిరంజీలు, ఏకంగా రోడ్డుపై విసిరేస్తున్నారు. రైల్వే స్టేషన్‌రోడ్డులో ఏకంగా ఓ దుకాణం దారుడు రోడ్డుపైనే కాలం చెల్లిన మందుబిల్లలు, సిరంజీలు వేశాడు. నిబంధనల ప్రకారం మెడికల్ వ్యర్థాలను ఒక పద్ధతి ప్రకారం రీసైకిల్ చేయాలి, కొన్నింటిని పూర్తిగా కాల్చివేయాలి. అయితే ఇక్కడ నేరుగా ఇక్కడ రోడ్డుపైనే పడేస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా, అధికారులు ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సెయింట్ ఆన్స్‌లో పరిశోధన కేంద్రం ఏర్పాటుకు అనుమతి

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో కాకినాడ జేఎన్‌టీయూ వారి పరిశోధన కేంద్రానికి అనుమతి దక్కింది. అందుకు సంబంధించి కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు వివరాలు వెల్లడించారు. సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలాక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాల్లో కళాశాలకు అనుమతి లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. అందుకు సంబంధించిన అనుమతిపత్రాన్ని నిర్వాహకులు సోమవారం అందుకున్నారు.

మువ్వల వెంకటరమణకు ఘన సత్కారం



వెంకటరమణను సత్కరిస్తున్న ప్రతినిధులు

చీరాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల బీజేపీ నాయకులు మువ్వల వెంకట రమణరావు జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వెంకట రమణ బీజేపీలో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఉన్నత స్థానాన్ని దక్కించుకోవడంపై అభినందనలు కురిపించారు. కార్యక్రమంలో పలువురు క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థి బలవన్మరణం

ఈపూరుపాలెం(చీరాల), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థి (18) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మరో రెండు రోజుల్లో కళాశాలల చేరనుండగా ఘటన జరగడంపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇటీవలే కళాశాలకు వెళ్లేందుకు మారాం చేయడంతో తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాన్ని సైతం అతనికోసం కొనుగోలు చేశారు. అయితే ఉరికి వేలాడుతున్న కుమారుడిని చూసిన తల్లిదండ్రులు వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.